

పందికోన రిజర్వాయరులో చేపలు పడుతున్న దృశ్యం

పందికోనలో చేపల చోరులు..!

పందికోన రిజర్వాయరులో అక్రమార్కులు చేపల వేట సాగిస్తూ ప్రభుత్వ నిబంధనలను నీరు గారుస్తున్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపల వేటకు ఈ ఏడాది జూన్ 30 వరకే అనుమతులు ముగిశాయి. ఆ తర్వాత ఈ నాలుగు నెలలుగా కొందరు అక్రమార్కులు రిజర్వాయరులో చేపల వేట సాగిస్తూ రూ.లక్షల విలువ చేసే చేపలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. నాలుగు నెలల కాలంలో సుమారు రూ.50 లక్షల దాకా అక్రమార్కులు దోపిడీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా మత్స్యశాఖ అధికారులు అక్రమార్కులు ఇచ్చే మామూళ్ల మత్తులో చేపల దొంగలను చూసీ చూడనట్లు వదిలేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



- జూన్ 30తోనే ముగిసిన గడువు
- యథేచ్ఛగా చేపల అక్రమ రవాణా
- రూ.50 లక్షల దాకా దోపిడీ



బాక్సులను రవాణాకు సిద్ధం చేస్తున్న దృశ్యం

పత్తికొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) 1.02 టీంఎసీల సామర్థ్యంతో సుమారు 1200 ఎకరాల విస్తీర్ణంలో 1.02 టీఎంసీల నీటి సామర్థ్యంతో పత్తికొండ, దేవనకొండ, కోడుమూరు మండలాల పరిధిలో 68 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా పందికోన రిజర్వాయరును నిర్మించారు. ఇందుకు సంబంధించి కుడి, ఎడమ కాలువలు నిర్మాణంలో ఉండడంతో ఇప్పటి వరకు కేవలం 15వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. అయితే సాగునీటి మాట అటుంచితే సాగునీరు లక్ష్యంగా పూర్తి స్థాయిలో నెరవేరకపోయినా రిజర్వాయరులో చేపల పంపకం అక్రమార్కులకు వరంగా మారింది. ఇంత పెద్ద రిజర్వాయరులో చేపల పెంపకానికి రూ.3, 4 లక్షల లోపే అనుమతులు ఇస్తూ మత్స్యశాఖ అధికారులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. 2023లో రూ.3,13,211, అలాగే 2024లో రూ. 3,69,000కు వేలం పాటల ద్వారా మత్స్యశాఖ అధికారులు రిజర్వాయరులో చేపల వేటకు అనుమతులు ఇచ్చారు. అయితే ఈ ఏడాది తుగ్గలి మండలం జొన్నగిరి చెరువులో చేపల పెంపకం కోసం ఆ గ్రామానికి చెందిన పంచాయితీ రూ.11లక్షలకు చేపల పెంపకానికి అనుమతులు ఇచ్చింది. ఈ లెక్కన చూసుకుంటే జొన్నగిరి చెరువుకు 20 రెట్లు పెద్దదే. పందికోన రిజర్వాయరులో చేపల పెంపకం వేలం పాటలో ఏ స్థాయిలో జరగాలన్నది తెలుస్తుంది. ఏటా రూ. కోట్లలో ఆదాయం వస్తున్నా రిజర్వాయరులో చేపల పెంపకానికి నామమాత్రపు ధరను నిర్ణయిస్తున్నా మత్స్యశాఖ గడువు ముగిశాక కూడా యథేచ్ఛగా చేపల వేట సాగడాన్ని చూసీచూడనట్లు వ్యవహరించడం పట్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత వ్యక్తుల నుంచి మామూళ్లు పెద్ద మొత్తంలో అందుతుండటంతో మత్స్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అక్రమార్కులు ఏర్పాటు చేసుకున్న టెంట్లు, పడవలు

రోజుకు రూ. లక్ష చేపల ఎగుమతులు..

పందికోన రిజర్వాయరులో అక్రమంగా పట్టిన చేపలను అక్రమార్కులు వివిధ మార్గాల ద్వారా ఎగుమతి చేస్తున్నారు. ఒక్కరోజుకు లక్ష రూపాయల విలువ చేసే చేపలను ఇక్కడి నుంచి బొలెరో వాహనాల ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం. సదరు వాహనాంలో 50 బాక్సుల దాకా తరలించే అవకాశం ఉండగా వ్యాపారులు ఒక్కో బాక్సులో 30 కిలోల చొప్పున 1500 కిలోలు రోజుకు ఇక్కడి నుంచి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. బహిరంగ మార్కెట్‌లో హోల్‌సేల్ ధర కింద వ్యాపారులు రూ.70 చొప్పున ఈ చేపలు విక్రయిస్తున్నట్లు సమాచారం. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ రెండున్నర లక్షల దాకా ఉంటుందని సమాచారం. సుమారు నాలుగు నెలల కాలంలో రూ.50 లక్షల విలువ చేసే చేపలను వ్యాపారులు అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే గడువు ముగిశాక వేలం పాటలు నిర్వహించకుండా చేపలు అక్రమంగా అక్రమార్కులు పట్టుకుంటున్నా మత్స్యశాఖ ఎందుకు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై ఇన్‌చార్జి మత్స్యశాఖ డీఈ నాగరాజును వివరణ కోరగా తాము గడువు ముగిశాక పందికోన రిజర్వాయరులో మత్స్యకారులను ఖాళీ చేయించామని, అక్కడ చేపలు పట్టడం లేదని చెప్పడం గమనార్హం.

సుఖ సంతోషాల కోసమే మహా యాగం

- కలెక్టర్ డాక్టర్ సిరి
- పాల్గొన్న ఎస్పీ విక్రాంత్, ఎమ్మెల్యే బీవీ
- ఘన స్వాగతం పలికిన నిర్వాహకులు
- ఐదో రోజుకు చేరిన విశ్వశాంతి యాగం



హోమంలో పాల్గొన్న కలెక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండేందు కోసమే విశ్వశాంతి యాగం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏ. సిరి అన్నారు. పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో శ్రీ కృష్ణమఠం పీఠాధిపతి స్వరూపానంద స్వామిజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 87వ విశ్వశాంతి యాగం ఐదో రోజుకు చేరుకుంది. మంగళవారం మహాయాగంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి పాల్గొని హోమాలు నిర్వహించారు. వీరికి నిర్వాహకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. దాదాపు గంటన్నరకు పైగా హోమాల్లో కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు హనుమత్ సహిత సుబ్రమణ్య హోమాలు, చండీహోమాలను పండితులు నిర్వహించారు. కలెక్టర్ సిరి మాట్లాడుతూ ప్రజలు భక్తి శ్రద్ధలతో యాగంలో పాల్గొనాలన్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మిగనూరులో లోక కల్యాణం కోసం జరుగుతున్న అతిచండీ, అతి రుద్రయాగం వంటి హోమాలు జరగటం అదృష్టమన్నారు. కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలకు నిర్వాహకులు సన్మానించి ఆశీర్వాదం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ శేషఫణి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లయ్య, సీఐ శ్రీనివాసులు, నాయకులు మచాని మహేష్, శివశంకర్, మహేంద్ర, బీజేపీ నరసింహులు, శివ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మార్చి వరకు సాగునీరు అందించాలి

- కలెక్టర్‌ను కోరిన టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): టీబీ డ్యాం నుంచి రైతులకు మార్చి ఆఖరు వరకు సాగునీరు అందించాలని టీడీపీ ముఖ్య నాయకులు కోరారు. మంగళవారం ఎమ్మిగనూరు వచ్చిన కలెక్టర్ ఏ.సిరిని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, ఎల్లెల్సీ చైర్మన్ టిప్పు సుల్తాన్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు రమాకాంత రెడ్డి, గోవర్ధన రెడ్డి, టీడీపీ రైతుసంఘం జిల్లా నాయకుడు సాయిబాబా, రామకృష్ణారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ తుంగభద్ర బోర్డు అధికారులు గేట్లు మరమ్మతులు చేస్తున్నందున డిసెంబరు వరకే నీటి విడుదల చేస్తామంటున్నారన్నారు. డిసెంబర్‌లో నీరు విడుదల బంద్‌చేస్తే రైతులు ఇబ్బందులు పడతారన్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో రైతులు అతివర్షాలతో భారీగా నష్టపోయారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎల్లెల్సీ కింద రబీ సీజన్‌లో రైతులకు వచ్చే ఏడాది మార్చి ఆఖరు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను వారు కోరారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.



నేడు కార్తీక పౌర్ణమి

ఓం నమఃశివాయ

శైవ క్షేత్రాలపై ప్రత్యేక కథనాలు 6లో

కర్నూలు కీర్తి ప్రతిష్టలు పెంపొందించేలా కళా ప్రదర్శనలు

7



జీజీహెచ్‌లో ట్రైనీ ఐఏఎస్‌కు శస్త్రచికిత్స

భుజానికి సర్జరీ చేసిన హాస్పిటల్ సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశా ల(జీజీహెచ్)లో శిక్షణ కోసం వచ్చిన ట్రైనీ ఐఏఎస్ డిఫెండర్‌కు మంగళవారం భుజం ఆపరేషన్‌ను హాస్పిటల్ సూపరింటెండెంట్ విజయవంతంగా నిర్వహించారు. హర్యానాకు చెందిన ట్రైనీ ఐఏఎస్ డిఫెండర్ ఈ నెల 1న అఖిల భారత సర్వీసుల అధికారుల బృందంలో జిల్లాలో శిక్షణ కోసం వచ్చారు. స్టేట్ గెస్టు హౌస్‌లో బస చేసిన ఆయనకు మంగళవారం తెల్లవారుజామున ఉన్నట్లుండి కుడి భుజం జాయింట్ (రైట్ షోల్డర్ డిస్లోకేషన్) పక్కకు జరగడంతో భుజం కదలడంలో తీవ్ర ఇబ్బంది, నొప్పితో బాధపడ్డారు. భుజం నొప్పి ఎంతకూ తగ్గకపోవడంతో ఉదయం 7.30 గంటల సమయంలో ఆయన హాస్పిటల్‌లో అడ్మిషన్ అయ్యారు. కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు ఆర్థోపెడిక్ సర్జన్ కావడంతో స్వయంగా ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌కు వెళ్లి పరీక్షలు నిర్వహించారు. ఎక్స్‌రే పరీక్షలో కుడి భుజం జాయింట్ పక్కకు జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. ఉదయం 8 గంటలకు హాస్పిటల్ సూపరింటెండెంట్ స్వయంగా శస్త్ర చికిత్స నిర్వహించారు. అనస్తీషియా డాక్టర్ రాథోడ్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఆపరేషన్ అనంతరం ట్రైనీ ఐఏఎస్‌కు ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించగా నార్మల్ అని తేలడంతో ఆయనను డిశ్చార్జ్ చేశారు. ట్రైనీ ఐఏఎస్ ఆరోగ్య పరిస్థితిని కలెక్టర్ ఏ.సిరి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు.



ఆపరేషన్ అనంతరం ట్రైనీ ఐఏఎస్‌తో మాట్లాడుతున్న హాస్పిటల్ సూపరింటెండెంట్

రమణీయం.. ప్రహ్లాదరాయల తెప్పోత్సవం

- మూలబృందావనానికి ప్రత్యేక పూజలు
- మయూరి వాహనంపై విహారం



పుష్కరిణిలో తెప్పోత్సవంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ప్రహ్లాదరాయలు పుష్కరిణిలో తెప్పోత్సవంపై రాత్రి రమణీయంగా నిర్వహించారు. మంగళవారం రాఘవేంద్రస్వామి మఠంలో కార్తీక పౌర్ణమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రహ్లాదరాయలకు పాద పూజచేసి పల్లకిలో అధిష్టించి రమణీయంగా ఊరేగించారు. వేదపండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాలు మధ్య శ్రీమఠం ప్రాంగణం చుట్టూ మయూరి వాహనంపై ఆసీనుడైన ఉత్సవమూర్తి పల్లకి ఊరేగింపుతో పుష్కరిణి వద్దకు తెస్తున్న దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యుత్ దీపాల వెలుగుల మధ్య తెప్పోత్సవంపై ప్రహ్లాదరాయలు విహారించారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేషపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మఠం పీఠాధిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సురేష్‌కోణాపూర్, శ్రీపతిఆచార్, దివాన్ శ్రీనాథ్ ఆచార్, సుజయీంద్ర ఆచార్, ఎస్ఐ శివాంజల్ పాల్గొన్నారు.

పుస్తకాలు వదిలి.. పత్తి కోతలకు వెళ్లి..



పుస్తకాల్లో పేజీలు తిప్పేయాల్సిన చేత్తో పొలంలో పత్తిని కోస్తున్న నివేదిత

పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన చిట్టి చేతులు.. పత్తి కోత పనుల్లో మగ్గుతున్నాయి. అధికారుల అలసత్వంతో ఓ విద్యార్థిని బడిబాట వదిలి కూలీ పనులకెళ్తుంది. ఎమ్మిగనూరు మండలంలోని సోగనూరు గ్రామానికి చెందిన రాముడు, జయంతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద అమ్మాయి నివేదిత ఐదో తరగతి వరకు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుకుంది. ఆదోనిలోని కేజీబీవీలో ఆరో తరగతిలో చేరింది. మూడు నెలలు గడిచాక ఆమెకు చర్మసంబంధిత వ్యాధి వచ్చింది. తల్లిదండ్రులు ప్రతిసారి ఆదోనికి వెళ్లి చికిత్స చేయించడం ఇబ్బందికరంగా మారింది. ఆదోని నుంచి ఎమ్మిగనూరు కేజీబీవీకి బదలాయించాలని డీఈవోను కలిశారు. ఇందుకు స్పందించిన డీఈవో వెంటనే నివేదితను ఆదోని నుంచి ఎమ్మిగనూరుకు బదిలీ చేసేందుకు ఉత్తర్వులిచ్చారు. బాలిక తండ్రి రాముడు ఎమ్మిగనూరు కేజీబీవీకి వెళ్లి డీఈఓ ఆదేశాలను చూపించి విద్యాలయంలో చేర్చుకోవాలని వేడుకున్నారు. స్థానిక అధికారులు జీసీడీవో ఆదేశాలు లేనిదే చేర్చుకోలేమని తిప్పి పంపారు. దీంతో తల్లితో పాటు చిన్నారి పత్తి పనులకు వెళ్తోంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించి తమ కూతురు నివేదితకు ఎమ్మిగనూరు కేజీబీవీలో సీటు ఇప్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

- ఎమ్మిగనూరు, ఆంధ్రజ్యోతి



నివేదిత తండ్రి రాముడు

నలుగురు ఎస్ఐలకు స్థానచలనం

కర్నూలు క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నలుగురు ఎస్ఐలకు స్థాన చలనం కలిగిస్తూ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవలే వెల్దుర్తి నుంచి గూడూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన అశోక్ పోస్టింగ్‌ను రద్దు చేస్తూ తిరిగి తాలుకా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. అలాగే గూడూరు పోలీస్ స్టేషన్ నుంచి కర్నూలు త్రీటౌన్ ఎస్ఐ తిమ్మయ్య పోస్టింగ్‌ను రద్దు చేసి తిరిగి కర్నూలు టూటౌన్‌కు నియమించారు. కోసిగి పోలీస్ స్టేషన్ నుంచి కర్నూలు టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన ఎస్ఐ హనుమంత రెడ్డిని తిరిగి గూడూరు పీఎస్‌కు నియమించారు. తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఎస్ఐ పీరయ్యను త్రీటౌన్‌కు బదిలీ చేశారు.

ఆ సొమ్ము పోయినట్లేనా?



- జడ్పీకి రావాల్సిన రూ.4.38 కోట్ల సర్‌చార్జీపై అనుమానం
- గతంలో నేరుగా స్థానిక సంస్థల ఖాతాల్లో జమ
- సీఎఫ్ఎంఎస్ వచ్చాక రాష్ట్రం చేతుల్లోకి
- అక్కడ నుంచి రావడం ఇక గగనమే

కర్నూలు న్యూసిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాలనా సంస్కరణల పేరుతో ప్రభుత్వాలు తీసుకుంటున్న కొత్త నిర్ణయాలు స్థానిక స్వపరిపాలన సంస్థల నడ్డి విరుస్తున్నాయి. ఒకప్పుడు నేరుగా స్థానిక సంస్థల ఖాతాల్లో జమ అయ్యే సర్‌చార్జీలపై కూడ సీఎఫ్ఎంఎస్(సెంట్రల్ ఫండ్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)కు వెళ్లడం పెనుశాపంగా పరిణమించింది. జగన్ జమానాలో సీఎఫ్ఎంఎస్‌కు వెళ్లిన నిధులు తిరిగి స్థానిక సంస్థలకు రాకపోవడంతో ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్‌కు రూ.4.38 కోట్లు నష్టపోవాల్సిన దుస్థితి దాపురించింది. ప్రస్తుత ప్రభుత్వం అయినా ఆ సమస్యపై దృష్టి సారించి పరిష్కారం చూపుతుందన్న ఆశ రోజు రోజుకూ అడుగంటుతోంది.

చట్టపరంగా నిధులు పంపాలని కోరుతున్నాం...

జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన సర్‌చార్జీలు చట్టపరంగా పంపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నాం. ఇప్పటికే పలుమార్లు చెప్పాం. త్వరలోనే పంపేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి సీఎఫ్ఎంఎస్‌కు వెళ్లిన వెంటనే స్థానిక సంస్థల ఖాతాల్లో జమ అవుతాయి.

- జి. నాసరరెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో



గతంలో చెల్లింపులు స్థానికంగానే..

ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్‌కు ప్రధాన ఆదాయ వనరుల్లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి వచ్చే సర్‌చార్జీ(ట్రాన్స్‌ఫర్ డ్యూటీ) అత్యంత ప్రధానమైంది. గతంలో ఈ చెల్లింపులు స్థానికం గానే జరిగేవి. కాబట్టి పెద్దగా పెండింగ్ ఉండేది కావు. సీఎఫ్ఎంఎస్ వచ్చిన తరువాత పరిస్థితి మారిపోయింది. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి వద్ద నుంచి వసూలు చేసు సర్‌చార్జీ నేరుగా సీఎఫ్ ఎంఎస్‌కు వెళ్తుంది. దానిని ఆర్థికశాఖ అధికారులు పరిశీలించి విడుదల చేయాలి. 2014-2019 మధ్యకాలంలో ఆ చెల్లింపులు సక్రమంగానే జరిగాయి. 2019లో ప్రభుత్వం మారిన తరువాత సీఎఫ్ ఎంఎస్‌కు వెళ్లిన సర్‌చార్జీలను కూడ ప్రభుత్వం వాడుకోవడం ఆరంభించింది. ఆ సొమ్ము స్థానిక సంస్థలకు విడుదల చేయటానికి ప్రభుత్వం ఇబ్బంది పెడుతోంది. ఆ రకంగా కర్నూలు జిల్లా పరిషత్‌కు రావాల్సిన సర్‌చార్జీ రూ. కోట్లలో పేరుకుపోయింది. కూటమి ప్రభుత్వం కూడా గడిచిన 17 నెలలుగా ఆ ఊసే ఎత్తడం లేదు.

రావాల్సింది రూ.4.38 కోట్లు


ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్‌కు సర్‌చార్జీ రూపేణా రావాల్సిన సొమ్ము వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లా నుంచి 2018-2019 - 2024-2025 వరకు రూ. 1,58.87,748, కర్నూలు జిల్లా నుంచి 2018-2019 - 2024-2025 వరకు రూ.2,19,39,717 రావాల్సి ఉంది. మొత్తం 4,38,27,465 సర్‌చార్జీ సొమ్ము రావాల్సి ఉందని జిల్లా పరిషత్ అధికారులు చెబుతున్నారు.

ఓం నమః శివాయ

- శైవక్షేత్రాలకు నెలవు నల్లమల
- ప్రకృతి ఒడిలో ప్రాచీన పుణ్యక్షేత్రాలు
- నేడు కార్తీక పౌర్ణమి








నల్లమల అడవులు ప్రసిద్ధ శైవ క్షేత్రాలకు నెలవు. శ్రీశైలం, మహానంది, యాగంటి, సంగమేశ్వరం, ఓంకారం, కొలనుభారతి వంటి ఆలయాలు నల్లమల ఒడిలో ఒదిగి ఉన్నాయి. శైవ క్షేత్రాలకు ఏటా పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తుంటారు. మహాశివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం రావడంతో ఈ క్షేత్రాలన్నీ శివనామస్మరణతో ప్రతిధ్వనిస్తున్నాయి. కార్తీక సోమవారాలు, సెలవు రోజుల్లో ఈ క్షేత్రాలు భక్తులతో కిటకిట లాడుతున్నాయి. ప్రత్యేకించి కార్తీక పౌర్ణమి రోజున స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. అక్టోబరు 21వ తేదీన కార్తీక మాసం మొదలై నవంబరు 19కి ముగియనుంది. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా నంద్యాల జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనున్నాయి. ఈ శైవక్షేత్రాలకు తరలిరానున్న భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పలు శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. రుద్రకోడూరు, నాగలూటి, చిన్నగుమ్మితం, పెద్దగుమ్మితం క్షేత్రాలకు ప్రైవేట్ వాహనాల్లో అటవీ అధికారుల అనుమతుల మేరకు వెళ్లాల్సి వుంది. నేడు కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని నల్లమల శైవక్షేత్రాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- ఆత్మకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి)



శ్రీశైల మహాక్షేత్రం: ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. భ్రమరాంబ, మల్లికార్జున స్వామి, అమ్మవార్ల దర్శనార్థం దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పాతాళగంగలో కార్తీక పుణ్యస్నానాలు ఆచరించి భక్తులు పునీతులవుతున్నారు. క్షేత్రపరిధిలోని పలువురి దేవతామూర్తుల ఉప ఆలయాలు కొలువుదీరి ఉన్నాయి. ప్రత్యేకించి సాక్షిగణపతి, హఠకేశ్వరం, అక్కమహాదేవి గుహలు, ఇష్టకామేశ్వరి తదితర ఆలయాలతో పాటు పాలధార, పంచధార, శిఖరం, శివాజీ స్ఫూర్తికేంద్రం వంటి సందర్శనీయ ప్రదేశాలు ఉన్నాయి. క్షేత్రానికి కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, ఆత్మకూరు తదితర పట్టణాల నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులు ఉన్నాయి. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని క్షేత్రంలో లక్షదీపోత్సవం, పుష్కరిణికి నవవిధహారతులు, జ్వాలాతోరణం వంటి క్రతువులను శాస్త్రోక్తంగా చేపట్టనున్నారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఇప్పటికే దేవస్థానం అధికారులకు భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లు, ప్రత్యేక లడ్డూ కౌంటర్లు, అన్నదానం తదితర వసతులను కల్పిస్తున్నారు.



మహానంది క్షేత్రం: నల్లమల ప్రకృతి అందాల నడుమ వెలసిన మహానంది క్షేత్రాన్ని నందన చక్రవర్తి కాలంలో నిర్మించినట్లు ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది. అత్యంత ప్రాచీన ఈ క్షేత్రంలో కామేశ్వరీసహిత మహానందీశ్వరుడి దర్శనార్థం కార్తీక మాసంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. క్షేత్ర పరిధిలో రుద్రగుండ కోనేరులో, ఆలయ వెలుపల ఉన్న చిన్నపాటి రెండు కోనేరుల్లో భక్తులు కార్తీక పుణ్యస్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శిస్తారు. క్షేత్ర పరిసరాలు.. నల్లమల అందాలు, ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్న ఈ క్షేత్రంలో మహానంది విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే క్షేత్రంలో భక్తులు విడిది చేసేందుకు వీలుగా ప్రైవేట్ కాటేజీలు కూడా అందుబాటులో ఉన్నాయి. నంద్యాల నుంచి ఆటోలు, బస్సులు నిత్యం క్షేత్రానికి రాకపోకలు జరుపుతుంటాయి.



పెద్దగుమ్మితం: మండల పరిధిలోని వడ్లరామాపురం గ్రామానికి 6 కి.మీ దూరంలో గల ఎత్తైన నల్లమల కొండల్లో వెలసిన గుప్త మల్లికార్జున స్వామి క్షేత్రం ఎంతో ఖ్యాతి కెక్కింది. ఇక్కడ కొలువైన ముక్కంటేశ్వరుడ్ని, ధాన్య భ్రమరాంబదేవిని భక్తితో కొలిస్తే కోరికలు సిద్ధిస్తాయన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ ఆలయం అతిపురాతనమైనది. ద్వాపర యుగంలో పాండవులు అరణ్యవాసం చేసే సమయంలో ధర్మరాజు ఈ శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లు పురాణాల ఆధారంగా తెలుస్తోంది. ఆలయానికి వెనుకభాగంలో భారీ మర్రివృక్షం కూడా వుంది. ఈ వృక్షం సుమారు 400 ఏళ్ల వుండవచ్చని పెద్దలు చెబుతున్నారు. ఆలయానికి ముందుభాగంలో వున్న ఉసిరి చెట్టుపై ఒక మద్దిచెట్టు, రెండు జీవిచెట్లు వున్నాయి. ఈ క్షేత్రానికి చేరుకునేందుకు వడ్లరామాపురం, ఇందిరేశ్వరం చెంచుగూడెల నుంచి భక్తులు కాలినడకన అటవీమార్గం గుండా చేరుకుంటారు.

సంగమేశ్వరక్షేత్రం: కొత్తపల్లి మండలంలోని సప్తనదుల సంగమక్షేత్రంలో సంగమేశ్వరాలయం నదీజలాల్లో నీటమునగడంతో ప్రస్తుతం ఎగువ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలను జరపనున్నారు. క్షేత్రంలో ఎగువ పుష్కర ఘాట్ వరకు నదీ జలాలు ఉండటంతో భక్తులు సప్తనదీ జలాల్లో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలను వెలిగించనున్నారు. దీంతో కార్తీక పౌర్ణమి రోజుకే క్షేత్రంలో వేపదారు శివలింగం దర్శనభాగ్యం భక్తులకు కలగనుంది. అలాగే ఎగువ ఉమామహేశ్వరాలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించవచ్చు. ఈ క్షేత్రానికి చేరుకునేందుకు ఆత్మకూరు నుంచి 37కిమీలు ప్రయాణిస్తే.. ఈ క్షేత్రానికి వెళ్లవచ్చు. క్షేత్రానికి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం కాశిరెడ్డినాయన ఆశ్రమం వారు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.






రుద్ర కోటేశ్వరాలయం: మండల పరిధిలోని నల్లకాల్వ గ్రామం నుంచి 15 కి.మీ దూరంలో నల్లమల అరణ్యంలో రుద్రకోటేశ్వరాలయం వెలసిం ది. పూర్వం ఈ క్షేత్రంలో పరమేశ్వరుడు స్వయంభూ లింగ రూపంలో వెలసినట్లు పురాణ ఇతిహాసాలు చెబు తున్నాయి. ప్రతి ఏడాది మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమి రోజునభక్తుల పెద్దఎత్తున తరలివచ్చి రుద్రకోటేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రస్తుతం రుద్రకోటేశ్వరాలయం చేరుకునేందుకు అటవీ మార్గంలోని మూడు వాగుల్లో నీటి ప్రవాహం ఉంది. ట్రాక్టర్ల ద్వారా అటవీ శాఖ అనుమతుల మేరకు క్షేత్రానికి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం క్షేత్రానికి చేరుకునేందుకు అటవీ ప్రాంతంలో వాగులు అడ్డంకిగా మారాయి.



ఓంకార క్షేత్రం : జిల్లాలోని బండిఆత్మకూరు మండలంలో వెలసిన ఓంకార క్షేత్రం కార్తీక మాస శోభ సంతరించుకుంది. చాళుక్యుల కాలంలో క్షేత్ర నిర్మాణం జరిగినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని క్షేత్రంలో వెలసిన గంగా ఉమాసమేత సిద్ధేశ్వరస్వామి దర్శనార్థం భక్తులు విశేషంగా తరలివస్తుంటారు. అలాగే ఎగువ ఉన్న కొండపై కాశీవిశాలక్ష్మీ అమ్మవారి ఆలయం, వేంకటేశ్వరుడిని సన్నిధితో పాటు పలువురి దేవతామూర్తుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దిగువ క్షేత్రంలో వున్న కోనేరులో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. క్షేత్రానికి వచ్చే భక్తులందరికి కాశిరెడ్డినాయన ఆశ్రమం తరపున నిత్యాన్నదాన సత్రం నిర్విరామంగా కొనసాగుతోంది. మండల కేంద్రమైన బండిఆత్మకూరు నుంచి 12 కిమీల దూరంలో వున్న ఈ క్షేత్రానికి వెళ్లేందుకు ఆటోలతో పాటు ఆర్టీసీ బస్సులు కూడా అందుబాటులో వుంటాయి.

యాగంటి క్షేత్రం : రాష్ట్రంలోని శైవ పుణ్యక్షేత్రాల్లో యాగంటి ప్రసిద్ధిగాంచింది. ఈ క్షేత్రంలోని ప్రధాన ఆలయంలో ఉమామహేశ్వర స్వామి, అమ్మవార్లు లింగంలో కొలువైవున్నారు. శివపార్వతులు ఇద్దరూ లింగంలో దర్శనమివ్వడం ఇక్కడ విశేషం. ఈ క్షేత్రంలో యాగంటి బసవన్న స్వయంభువుగా వెలసినట్లు భక్తుల నమ్మకం. ఈ నంది విగ్రహం రానురాను పెరుగుతూ ఆలయ ప్రాంగణాన్ని ఆక్రమిస్తోంది. ఈ క్షేత్రంలో ప్రకృతి ఒడిలో పట్టిన జలధార పర్వతసానుల్లో ప్రవహించి కోనేరులోకి చేరుతుంది. ఈ కోనేరును అగస్త్య పుష్కరిణిగా పిలుస్తారు. ఈ క్షేత్రానికి వెళ్లాలంటే నంద్యాల నుంచి రోడ్డుమార్గంలో 48కిమీలు బనగానపల్లెకు చేరుకుని అక్కడి నుంచి 11కిమీలు ప్రయాణిస్తే యాగంటికి చేరుకోవచ్చు.



నేడు జ్వాలాతోరణం

- కార్తీక పౌర్ణమికి ప్రత్యేక పూజలు
- అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులు

శ్రీశైలం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణోత్సవాన్ని నిర్వహిస్తారు. ఆలయ ప్రధాన వీధిలోని గంగాధర మండపం వద్ద బుధవారం సాయంత్రం జరిగే కార్యక్రమాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. మంగళవారం ఈవో శ్రీనివాసరావు ఆలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ కార్తీక పౌర్ణమికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జ్వాలాతోరణం జరిగే ప్రాంతంలో తోపులాట, తొక్కి సలాట జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వీక్షించేలా ప్రధాన కూడళ్లలో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారని, స్నానఘాట్‌ల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ పుష్కరిణి వద్ద జరిగే లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనేందుకు వీలుగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.



కార్తీక పౌర్ణమి ఏర్పాట్లపై అధికారులతో ఈవో సమావేశం

నవ నందుల దర్శనం.. పుణ్యప్రదం

- నవనంది క్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ
- కార్తీక మాసంలో పోటెత్తుతున్న భక్తులు
- సాక్షి మల్లికార్జునస్వామి దర్శనంతోనే నవనందుల యాత్ర

నంద్యాల కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో నవ నందుల దర్శనం పుణ్యప్రదమైంది. కార్తీకం ప్రారంభం నుంచి పూర్తయ్యే దాకా విశిష్ట దైవారాధనలతో విభిన్న ఆచార సాంప్రదాయాలతో, దీక్షలతో కొనసాగుతుంది. రాయలసీమ ప్రాంతంలోని మహానంది క్షేత్రం చుట్టూ నంద్యాల వరకు ఉండే నవ నందుల ఆలయాలకు భక్తులు ఈ పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

నవనందుల దర్శనమిలా..

నవనందులను దర్శించుకోవాలంటే ముందుగా నంద్యాలలోని సాక్షి మల్లికార్జునస్వామిని దర్శించుకొని, ఇక్కడ నందీశ్వరుని చెవిలో భక్తులు తమ కోరికలను చెప్పి నవనందుల యాత్ర ప్రారంభించాలి. ముగింపు కూడా ఇక్కడే స్వామిని దర్శించుకొని చేయాల్సి ఉంది.




నవనందుల దర్శనం రూట్ మ్యాప్

ప్రథమ నంది..



నవనందుల్లో మొదటిది ప్రథమ నందీశ్వరాలయం. నంద్యాలలోని చామకాలువ గట్టున ఆలయం ఉంది. గర్భాలయంలో కేదారేశ్వర లింగం భక్తులకు దర్శనమిస్తుంది. ఇక్కడే మరోపక్క కేదారేశ్వరీ మాత కొలువుదీరి ఉంది. ప్రథమనందిలోని స్వామివారిని దర్శించుకొని అక్కడ ఉన్న నందీశ్వరుడుని దర్శించుకోవాలి.

నాగనంది..




వ్యాసరాయల కాలంలో నంద్యాల బస్టాండు సమీపంలోని స్వయంభూ ఆంజనేయస్వామి ఆలయంలో కుందూ నదిలో నుంచి నాగనంది తీసుకొని వచ్చి అక్కడ ప్రతిష్ఠించినట్లు శాసనాలు చెబుతున్నాయి. ఆ ఆలయంలో భారీ ఆకారంలో ఉన్న అంజనేయస్వామి మూలవిరాట్ కు ఎడమ వైపున నాగనందీశ్వరుడు కొలువు దీరాడు.

సోమనంది..



నంద్యాల కోట వీధిలో ఆత్మకూరు బస్టాండు సమీపంలో ఉన్న ఆలయం సోమనందీశ్వరాలయం. చంద్రుడు ఇక్కడ మహేశ్వరలింగాన్ని ప్రతిష్ఠించడంతో ఈ లింగానికి సోమనందీశ్వరుడు అని పేరువచ్చింది. క్షేత్ర ప్రాశస్త్యం రీత్యా సోమ నందీశ్వరుడు ఆరోగ్యప్రదాత అని భక్తుల నమ్మకం.

శివనంది..



అతిపురాతన మైన శివనంది క్షేత్రం. శివనంది బండి ఆత్మకూరు మండలం కడమల కాల్వలో ఉంది. ప్రశాంతవాతావరణం, పచ్చని, ప్రకృతి దృశ్యాలు ఆభరణాలుగా అలరారుతున్న ఈ ఆలయ శోభ అనన్య సామాన్యం. ఆలయం చుట్టూ 108 శివలింగాలు ఉన్నట్లు చరిత్ర చెబుతోంది. ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే శివలింగానికి బ్రహ్మసూత్రం వుంటుంది. పురాణంలో రెండో కాళహస్తిగా పేరు పొందింది.

భళా.. భైరవ క్షేత్రం



చింతల చెరువు భైరవగుండాల క్షేత్రం ఏరియల్ వ్యూ

చాగలమర్రి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రకృతి సోయగాల నడుమ వెలసిన భైరవగుండాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి భైరవేశ్వర ఆలయం ఇక్కడ ఉంది. రాచరికపు గుర్తులు ఉన్న అతిపురాతన ఆలయం ఇది. పక్కన తెలుగుగంగ జలాశయం, నల్లమల కొండలు పర్యాటకులను ఆకర్షిస్తోంది. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చింతలచెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో 3 కి.మీ దూరంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో భైరవేశ్వర ఆలయం నిర్మించారు. ఇక్కడ ఈశ్వరుడు, భైరవీశ్వరుడు, పలు దేవతామూర్తులు కొలువుదీరారు. కృష్ణానది ఒడ్డున ఈశ్వర ఆలయం ఉండటం ఇక్కడి ప్రత్యేకత. శివాలయం పక్కన అమ్మవారు, సీతారాముల ఆలయాలు, అక్కదేవతలు, ఆంజనేయస్వామి గుడి కొలువై ఉన్నాయి. కాశీరెడ్డినాయన భైరవగుండాలను సందర్శించడం వల్ల గ్రామస్థులు కాశీరెడ్డినాయన గుడిని కూడా ఏర్పాటు చేశారు. ఈ ఆలయాన్ని ప్రతాప రుద్రుడు సందర్శించినట్లు గ్రామ పెద్దలు చెబుతున్నారు. కార్తీకమాసం, మహాశివరాత్రి ఉత్సవాలు ప్రతి ఏడాది అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. 5న బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 2008 మంది మహిళలచే అఖండ దీపోత్సవం, శివపార్వతుల కల్యాణోత్సవం, గణపతి, చండీ, పూర్ణాహుతి హోమాలు వేద పండితుల ఆధ్వర్యంలో జరిగేలా ఏర్పాట్లు చేశారు. కళాకారులచే సాంస్కృతిక, భజన కార్యక్రమాలు జరుగుతాయి. భక్తులకు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్తీకపౌర్ణమి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ అధ్యక్షుడు మునయ్యస్వామి, కమిటీ సభ్యులు కోరారు.

నేడు మహానందిలో కోటి దీపోత్సవం

మహానంది, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో బుధవారం కోటి దీపోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్తీకమాసం పౌర్ణమి పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు మేళతాళాలతో ఉత్సవమూర్తులను కళావేదిక మంటపం వద్దకు తీసుకుని వస్తారు. ఆలయం ప్రధాన రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన జ్వాలాతోరణాన్ని భక్తి శ్రద్ధలతో వెలిగిస్తారు. వేలాదిమంది భక్తుల సమక్షంలో ఆలయం పరిసరాల్లో రాత్రి 7 గంటల నుండి కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కాగా కోటి దీపోత్సవం కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి, ఆలయ అధికారులు పరిశీలించారు.



కోటి దీపోత్సవం(ఫైల్)

విష్ణునంది..



శివనందీశ్వరాలయానికి మూడు కిలోమీటర్ల దూరంలో నల్లమల అడవుల మధ్యలో ఉన్న ఈ ఆలయ శోభ వర్ణనాతీతం. ఈ ఆలయానికి చేరుకున్న భక్తులు ఇక్కడ ప్రకృతిమాత ఒడిలో మైమరిచిపోతారు. సాక్షాత్తు శ్రీమహావిష్ణువుచే ప్రతిష్ఠించిన లింగం కాబట్టి విష్ణునందీశ్వర క్షేత్రం అని పేరు వచ్చింది. గర్భాలయంలో విష్ణునందీశ్వరుడు లింగరూపంలో దర్శనమిస్తాడు.

మహానంది...



నందీశ్వరుడు జన్మించిన క్షేత్రమే మహానంది అని భక్తుల నమ్మకం. ఇక్కడి గంగతో సమానమైన తీర్థం వేరొకటి లేదని, ఈశ్వరుడికి అభిషేకం, ఉసరిక దీపం, చేయడం ఈ క్షేత్రంలోని సంప్రదాయాలు. నందీతీర్థం అనేది ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ.

సూర్యనంది దేవాలయం...



నంద్యాలకు 8 కిలోమీటర్ల దూరంలోని నందిపల్లెలో వెలసిన సూర్యనంది క్షేత్రం. సూర్యుడు ఇక్కడ శివుడి గురించి తపస్సు చేసి ఆస్వామి లింగాన్ని ప్రతిష్ఠించాడు. నవనందుల యాత్ర చివరిగా సూర్యనంది దేవాలయంతో పూర్తి అయుంది. ఈ నవనందులను దర్శనం చేసుకుంటే కాశీకి పోయినంత పుణ్యఫలం వస్తుందన్నారు.

వినాయక నంది..



మహానందీశ్వరాలయానికి ఈశాన్య దిశలో పరమేశ్వర లింగాన్ని సాక్షాత్తు వినాయకుడు ప్రతిష్ఠించినట్లు చెబుతారు. నాగఫణి చత్రంగా ఇక్కడ స్వామివారు అలరారుతున్నారు.

గరుడ నందీశ్వరుడు...



మహానంది దివ్యక్షేత్రం నడిబొడ్డున గరుడ నందీశ్వరుడు కొలువుదీరాడు. ఈ గరుడ నందీశ్వరాలయం అతి పురాతనమైనది. గరుత్మంతుడు ఇక్కడ మహాదేవుని గురించి తపస్సు చేసి ఇక్కడ భవ్య లింగాన్ని ప్రతిష్ఠించినట్లు పురాణాల ద్వారా మనకు అవగతమవుతోంది.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కర్నూలు క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కప్పల్‌నగర్‌కు చెందిన ఓ డిగ్రీ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొద్ది కాలంగా ఓ యువతితో ప్రేమాయణం సాగించాడు. ఆ యువతికి సంబంధించిన బంగారు నగలను తీసుకుని తాకట్టు పెట్టి తర్వాత విడిపించలేదు. విషయం యువతి తండ్రికి తెలియడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఇరు వర్గాలను పిలిపించి సమస్య పరిష్కరించే విదంగా చర్చించారు. అయితే ఆ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఓ ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాసనగర్‌కు చెందిన జానీ(16) ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల మేరకు.. జానీ 8వ తరగతి వరకు చదివి మానేశాడు. చెడు అలవాట్లకు లోనై చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ జల్సా చేసేవాడు. తండ్రి చిన్నరాముడు ప్రవర్తన మార్చుకోవాలని పలుమారు చెప్పినా మార్పు రాలేదు. కాగా మరోసారి ఇంట్లోని బీరువాలో దొంగతనం చేసేందుకు ప్రయత్నించగా తండ్రి తీవ్రంగా మందలించాడు. దీంతో తాను పని చేసే గౌండా గౌస్ కొట్టం వద్దకు వెళ్లి ఉరి వేసుకున్నాడు. గౌండా గౌస్ గుర్తించి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. తండ్రి చిన్నరాముడు, బంధువులు చేరకుని హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తన కొడుకు మృతిపై అనుమానం ఉందని తండ్రి చిన్నరాముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమంతుగుండం గ్రామంలో దారా రమేష్(30) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో రమేష్ పురుగుల మందు తాగుతుండగా గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. తల్లి రాజమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు తెలిపారు.

దీపం వెలిగిస్తూ బాలిక..

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం నరసాపురం గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మూడో తరగతి విద్యార్థి రేవతి కార్తీక దీపం వెలిగిస్తూ నిప్పంటుకుని మృతిచెందినట్లు డీఈవో శామ్యూల్ తెలిపారు. ఆంజనేయస్వామి గుడిలో కార్తిక మాసం సందర్భంగా దీపం వెలిగిస్తుండగా బాలిక దుస్తులకు నిప్పంటుకుంది. అయితే ఈ ప్రమాదం పాఠశాలలో చోటుచేసుకోలేదని డీఈవో కలెక్టర్‌కు తెలియజేశారు.

సాక్షి యాజమాన్యంపై కేసు నమోదు

కర్నూలు క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి, రిపోర్టర్ ప్రతాప్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ పార్థసారధి తెలిపారు. వివరాల మేరకు.. గత నెల 30న తన పరువుకు భంగం కలిగించేలా వార్తలు ప్రచురించారని, రంగరాజు వీధికి చెందిన సందీప్ అనే వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ముక్కు మొహం తెలియని వ్యక్తులు కాంట్రాక్టర్ లైసెన్సు లేని వారు కార్పొరేషన్‌లో పెత్తనం చెలాయిస్తున్నారనే ఆరోపణలతో పరోక్షంగా పార్టీ నాయకులు, మంత్రి టీజీ భరత్‌పై నిందలు వేయడంతో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్టు



దొంగను చూపుతున్న రైల్వే ఎస్‌ఐ కుమారి

నంద్యాల టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నంద్యాల రైల్వేస్టేషన్‌లో సెల్‌ఫోన్ దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ కుమారి తెలిపారు. వివరాలు.. సోమవారం రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారం 1 వద్ద ఓ వ్యక్తి గుంటూరు-కాచిగూడ రైలు ఎక్కే సమయంలో ఫోన్లు చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు హుల్లప్పను రైల్వేస్టేషన్ నూతన ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద పట్టుకున్నాం. అతడి వద్ద నుంచి రూ.1.20లక్షల విలువ చేసే నాలుగు ఫోన్లను స్వాధీనం చేసుకుని అరెస్టుచేసి రిమాండుకు తరలించామన్నారు. దొంగను పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ ఖలీల్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

6న వ్యాస రచన, వక్తృత్వ పోటీలు

కర్నూలు ఎడ్యుకేషన్/ కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారతరత్న డా. మౌలానా అబ్దుల్ కలాం అజాద్ జయంతి, మైనార్టీ సంక్షేమ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా స్థాయిలో అబ్దుల్ కలాం ఆజాద్ జీవిత చరిత్రపై హైస్కూల్, ఇంటర్, డిగ్రీ, పీజీ స్థాయి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ షమీనా పర్వీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కర్నూలు గడియారం ఆసుపత్రి వద్ద ఉన్న ప్రభుత్వ మైనార్టీ జూనియర్ కళాశాలలో పోటీలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తిగల విద్యార్థులు డా. షంషుద్దీన్ సెల్. నెంబర్.9441761026 ను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ పోటీల్లో విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేస్తారని అన్నారు.

యాగంటి వెతలు

- నిధులున్నా అభివృద్ధి చెందని క్షేత్రం
- ఏ పని చేపట్టాలన్నా ఆర్కియాలజీ శాఖ అడ్డంకులు
- వసతులు లేక భక్తుల ఇక్కట్లు



ఆలయం చుట్టూ ఉన్న కొండలు

బనగానపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. నిధులు ఉన్నా వాటిని ఖర్చు చేయని దుస్థితిలో దేవదాయశాఖ ఉంది. ఏ అభివృద్ధి పనులు చేపట్టాలన్నా ఆర్కియాలజీ శాఖ అధికారులు అడ్డుపడుతున్నారు. దీంతో కనీస వసతులు లేక భక్తులు ఇక్కట్లు పడుతున్నారు.

పురాతన యాగంటి క్షేత్రానికి జిల్లా నుంచే కాక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అధికసంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఆలయానికి భక్తుల ద్వారా సంవత్సరానికి రూ.కోటి వరకు ఆదాయం వస్తోంది. ప్రతి మూడు నెలలకోసారి స్వామి వారి హుండీని లెక్కిస్తుంటారు. ఇంత డబ్బు ఉన్నా.. క్షేత్రంలో ఏ అభివృద్ధి పని చేపట్టాలన్నా ఆర్కియాలజీ శాఖాధికారులు అడ్డుపడుతుంటారు. దీంతో ఆలయాధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. భక్తులు రాత్రి వేళల్లో బస చేయడానికి కూడా దేవదాయ స్థలం లేదు. ఉన్న యాగంటి ఆలయ స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయ సమీపంలో టూరిజం శాఖకు చెందిన 8 గదుల కాటేజీ మాత్రమే ఉంది. బ్రాహ్మిణి రెసిడెన్సీ మాత్రమే ఉన్నాయి. ఇందులో అద్దెలు ఎక్కువగా ఉన్నందు వల్ల భక్తులు స్వామి వారి దర్శనం చేసుకొని వెంటనే వెళ్లిపోతున్నారు.

కొండలను తొలిచి అభివృద్ధి చేయాలి

గత పాలక వర్గం సభ్యులు ఆలయం ఎదురుగా ఉన్న కొండలను కొంతమేరకు తొలచి విశాలమైన రోడ్లు వేయించారు. ఇట్లాగే మరింతగా కొండలు తొలచి చదును చేసి భక్తుల కోసం భవన నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఆలయం చుట్టూ ఉన్న భూములను యజమానుల నుంచి కొని భక్తులకు వసతి గదులు నిర్మించి ఉంటే ఇబ్బందులు ఉండేవి కాదని భక్తులు అంటున్నారు. నిధులు ఉన్నా, దాతులు ముందుకు వస్తున్నా సొంత స్థలం లేకపోవడంతో క్షేత్రం అభివృద్ధి కావడం లేదు. ఆలయాభివృద్ధికి ఏచిన్న పని చేపట్టినా చేయాలన్నా ఆర్కియాలజీ అధికారులు దేవదాయ శాఖాధికారులకు నోటీసులు జారీ చేస్తున్నారు.

అనుమతులు ఇవ్వడం లేదు

ఆలయం ఆర్కియాలజీ శాఖ పరిధిలో ఉండడంతో క్షేత్రంలో ఏ అభివృద్ధి పని చేయాలన్నా ఆర్కియాలజీ అధికారులు అడ్డుపడుతున్నారు. చివరికి ఆలయ కార్యనిర్వహణ అధికారి గది నిర్మించుకోవడానికి కూడా అనుమతి ఇవ్వడం లేదు. దీంతో ఈవో, సిబ్బంది ఆర్కియాలజీ శాఖ గదిలో విధులు నిర్వహిస్తున్నారు. దేవదాయ శాఖకు సొంత స్థలాలు లేకపోవడంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో కనీసం భక్తులకు వసతులు కల్పించుకోలేకపోతున్నారు. ఉన్న కొంత స్థలాన్ని ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయం చుట్టూ కొండలు ఉండడంతో భక్తులకు వసతి కల్పించలేకపోతున్నారు. ఆర్కియాలజీ శాఖ పరిధి నుంచి దేవదాయ శాఖ పరిధిలోకి ఈ ఆలయాన్ని చేరిస్తే అభివృద్ధి చెందుతుందని భక్తులు పేర్కొంటున్నారు.



యాగంటి క్షేత్రం రాజగోపురం

విద్యుత్ బిల్లు చూస్తేనే షాక్

- రైస్ మిల్లు ప్రారంభం కాక ముందే బిల్లు
- ఖంగుతిన్న యజమాని

నందికొట్కూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లు ప్రారంభం కాక ముందే విద్యుత్ బిల్లు మోత మోగింది. రూ.57,323 కరెంటు బిల్లు వచ్చింది. ఇదేమిటి రైస్‌మిల్లు ప్రారంభం కాకముందే ఇంత విద్యుత్ బిల్లు రావడంతో యజమాని ఒక్కసారిగా ఖంగుతిన్నాడు. వివరాలు.. మండలంలోని బిజినవేముల వద్ద ముబారక్ మొదీర్న్ యు.ఎస్.సీ నెం: 8532212001306 కు రూ.57,323 బిల్లు గత శనివారం వచ్చింది. బిల్లు చూసిన యజమాని అబ్దుల్ హమీద్ ఒక్కసారిగా షాక్‌కు గుర య్యారు. గత నెలలో రైస్ మిల్ మరమ్మతు పనులు చేస్తేనే రూ.21,771 వచ్చింది. ఈ నెలలో ఎలాంటి పనులు చేయలేదని, ఇంకా రైస్‌మిల్లు కూడా ప్రారంభం కాకముందే ఇంత విద్యుత్ బిల్లు రావడంతో ఏమిటో అర్థం కావడం లేదని వాపోతున్నారు. ఇలా విద్యుత్ బిల్లులు వస్తే రైస్ మిల్లు నిర్వహించే కన్నా ఏపీఎస్పీడీసీఎల్ వారికే రాసి ఇవ్వాల్సి వస్తోందని అన్నారు. ఈవిషయంపై విద్యుత్ ఏ.ఈ. రాములునాయక్‌ను వివరణ కోరగా రైస్ మిల్ యజమాని మాకు ఫిర్యాదు చేశారు. వర్షం కారణంగా ఈ రోజు వెరిఫికేషన్‌కు వెళ్లలేదు. కొత్త రైస్‌మిల్ కావడంతో విద్యుత్ కెపాసిటర్లు కం టిన్యూగా ఆన్‌లోనే ఉంచడంతో రీడింగ్ పెరిగి ఉంటుందన్నారు. బుధవారం రైస్‌మి ల్లును తనిఖీచేసి మీటరు రీటింగ్‌ను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



బిల్లు చూపుతున్న మిల్లు యజమాని

గాలిమరల భూముల పరిశీలన

బేతంచెర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరు గ్రామాల్లో గాలి మరలకు (ఈసీవో ఆర్‌ఈఎన్) కేటాయించిన భూములను జేసీ కార్తీక్, డోన్ ఆర్డీవో నరసింహులు, బేతంచెర్ల తహసీల్దార్ నాగమణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని కొలుములపల్లె, గూటుపల్లి, ఆర్ఎస్ రంగాపురం, బేతంచెర్ల, ముద్దవరం గ్రామాల్లోని భూములను చూశారు. ఈ సందర్భంగా జేసీ ప్రాజెక్టు అమలు సర్వే, భూ సంబంధిత అంశాలు, స్థల సరిహద్దులు, గ్రామాల్లో జరుగుతున్న పనులకు ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామ ప్రజలకు ప్రాజెక్టు ప్రయోజనాలను వివరించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.



తహసీల్దార్‌తో కలిసి రికార్డులను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

ఇళ్ల మధ్యలో కొండచిలువ



శ్రీశైలం నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): పదిహేను అడుగుల కొండచిలువ ఇళ్ల మధ్యలోకి రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. శ్రీశైల మండలంలోని సున్నిపెంట గ్రామంలో వెస్టర్న్ కాలనీ సత్యనారాయణస్వామి దేవాలయం సమీపంలో గల ఇళ్ల మధ్యలోకి పొడవైన కొండచిలువ వచ్చింది. అటుగా వెళ్తున్న కొందరు గమనించి ఇళ్లలో ఉండేవారిని అప్రమత్తం చెసి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు స్పందించడంతో, స్నేక్ క్యాచర్ కొండచిలువను పట్టుకుని అటవీ ప్రాంతో విడిచిపెట్టాడు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

నంద్యాల హాస్పిటల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అరుదైన శస్త్రచికిత్స చేసి రోగికి ఉపశమనం కలిగించారు. జీజీహెచ్ న్యూరోసర్జరీ డాక్టర్లు రాజేష్, భరత్ ఆస్పత్రి పరికరాలతో పాటు తమ సొంత పరికరాలతో జీజీహెచ్‌లో శస్త్రచికిత్స చేయడం విశేషం. ఇసుకపల్లెకి చెందిన రాజు గత నెల 30వ తేదీన ఆస్పత్రిలో చేరాడు. 31న వెన్నెముకలో డిస్క్ భాగం పెరిగి ఉండటంతో ఎండోస్కోపి ద్వారా ఆపరేషన్ చేశారు. డిస్క్‌కు అదనంగా వచ్చిన భాగాన్ని తీసివేశారు. సూపరింటెండెంట్ డా.మల్లేశ్వరి మాట్లాడుతూ రక్తస్రావం లేకుండా బటన్‌హోల్ ద్వారా ఆపరేషన్ నిర్వహించిన వైద్యులను, సిబ్బందిని అభినందించారు. ఆపరేషన్‌కు అవసరమైన పరికరాలు సొంతంగా తెచ్చుకొని జీజీహెచ్‌లో సర్జరీ చేయడం శుభపరిణామం అన్నారు. ఇదే సర్జరీ ప్రైవేట్ ఆస్పత్రిలో దాదాపు రూ.5లక్షల వరకు ఖర్చవుతుందని అలాంటిది ఉచితంగా జీజీహెచ్‌లో చేశామన్నారు. సర్జరీ అనంతరం తనకు ఎలాంటి ఇబ్బందిలేదని రోగి రాజు తెలిపారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డా.జిలాని, ఆర్‌ఎంవో డా.వెంకటేష్, అనస్థీషియా హెచ్‌వోడీ డా.క్రిష్ట ఫర్, జీజీహెచ్ ఏడీ మస్తాన్, ఓటీ సిబ్బంది పాల్గొన్నారు.



రోగితో వైద్యులు

రాఘవేంద్రుని సన్నిధిలో కర్నూలు ఎస్పీ

మంత్రాలయం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం మంత్రాలయంకు వచ్చారు. మహా ముఖద్వారం వద్ద మఠం జోనల్ మేనేజర్ శ్రీపతిఆచార్ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్‌ఐ శివాంజల్, వ్యాసరాజాచార్, రంగస్వామి, రామకృష్ణ, వీరేష్, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



ప్రదక్షిణ చేస్తున్న ఎస్పీ

కర్నూలు కీర్తి ప్రతిష్టలు

పెంపొందించేలా కళా ప్రదర్శనలు

- నాలుగో రోజు అలరించిన కళ, సాహిత్య ప్రదర్శనలు
- ఘనంగా 'కర్నూలు ఉత్సవ్-2025'



సాహితీవేత్తలను సత్కరిస్తున్న కళాక్షేత్రం కమిటీ సభ్యులు, ముఖ్య అతిథులు

కర్నూలు కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా కీర్తి ప్రతిష్టను పెంపొందించేలా కర్నూలు ఉత్సవ్-2025 ప్రదర్శనలు కొనసాగుతున్నాయని పలువురు వక్తలు కొనియాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర అవతరణ ఉత్సవాలు వారం రోజుల పాటు నిర్వహించడం అభినందనీయమన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కర్నూలు ఉత్సవ్-2025 ప్రదర్శనలు మంగళవారం నాలుగో రోజుకు సందడిగా సాగాయి. సాయంత్రం ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథులుగా రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి హాజరై తెలుగుతల్లి, పొట్టి శ్రీరాములు చిత్ర పటాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు కళాక్షేత్రంలో ఆవరణలో ఏర్పాటు చేసిన జిల్లా ప్రముఖుల ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా సభలో వక్తలు మాట్లాడుతూ జిల్లా జానపద కళలకు, సాహిత్యానికి, నాటక రంగానికి ఈ సభలు గుర్తింపు తెచ్చాయన్నారు. కనుమరుగవుతున్న తోలుబొమ్మలాట, చెక్కభజన వంటి అపురూప కళారూపాలను తెరమీదికి తీసుకువచ్చి, వారితో ప్రదర్శనలు ఇప్పించడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని అన్నారు. అనేక కళారూపాలు ఆదరణ లేక తెరచాటుకు తప్పుకుంటున్నాయని, టీజీవీ కళాక్షేత్రం వారి ఉనికిని గుర్తించి వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ టీజీవీ కళాక్షేత్రం నిత్యం కల్యాణం పచ్చతోరణంగా కళలు, కళారూపాలతో నిండుగా కనిపించాలనేది క్షేత్రం గౌరవ చైర్మన్, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ ఆకాంక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం ప్రతినిధులు సి.యాగంటీశ్వరప్ప, సీవీ రెడ్డి, లక్ష్మీకాంతరావు, పీపీ గురుమూర్తి, వాల్మీకి రాముడు, గాండ్ల లక్ష్మన్న, సంగా ఆంజనేయులు, కేవీ రమణ, జీవీ శ్రీనివాసరెడ్డి, మహ్మద్ మియా, పి.రాజారత్నం, ఇనాయతుల్లా, కె.బాలవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జానపద కళారూపాలు..

జానపద కళలకు పట్టం కడుతూ నాలుగో రోజు వేడుకలు కొనసాగాయి. ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఏకాంకిక పౌరాణిక పద్య నాటక నాటక పోటీలు కొనసాగాయి. నేటి తరానికి తెలియని తోలుబొమ్మలాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాజేశ్వరమ్మ బృందం, కుళ్లాయమ్మ బృందం సభ్యులు ఈ ప్రదర్శనలు చేశారు. నంద్యాల జిల్లా గాజులపల్లెకు చెందిన వై.గంగాధర్ బృందం చెక్కభజన ఉత్సాహాన్ని నింపింది. ఏకాంకిక నాటక ప్రదర్శనల్లో దేవనకొండకు చెందిన బృందం శ్రీకృష్ణ రాయబారం, డోన్ బృందం రామాంజనేయ యుద్ధం, బి.తాండ్రపాడు బృందం శ్రీకృష్ణ తులాభారం, దేవనకొండ బృందం గయోపాఖ్యానం, ఇతర ప్రాం తాల కళాకారుల సత్యహరిశ్చంద్ర, బాలనాగమ్మ ప్రదర్శనలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. తేజ బృందం శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.



శ్రీకృష్ణ రాయబారంలోని ఓ సన్నివేశం

సాహితీ ప్రముఖులకు సత్కారం

ఉమ్మడి జిల్లాలో సాహిత్య సేవలు అందిస్తున్న పలువురు సాహితీ ప్రముఖులను ఈ సభలో ఘనంగా సత్కరించారు. ఎస్‌డీవీ అజీజ్, గూడూరు మునిస్వామి, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, డాక్టర్ ఎం.హరికిషన్, కెంగార మోహన్, గోరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, నవప్పగారి ఈరన్న, రంగనాథ రామచంద్రరావు, గెలివి సహదేవుడు, ఆరేపల్లి వరలక్ష్మమ్మలకు ముఖ్య అతిథులకు సన్మానాలు నిర్వహించారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

మహాసభలను జయప్రదం చేయాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖలో నిర్వహించనున్న సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని నగర ఉపాధ్యక్షుడు సుధాకరప్ప డిమాండ్ చేశారు. ఆశా డే సందర్భంగా మంగళవారం నగరంలోని మెడికల్ హెల్త్ సెంటర్‌లో ఆశా వర్కర్ల సమస్యలను తెలుసుకున్నారు. ఆశా వర్కర్లకు కనీసవ వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి 5జీ మొబైల్‌ఫోన్లు, సెలవులు ఇవ్వాలని, మరణించిన కార్యకర్తల దహన సంస్కారాలకు రూ.20 వేలు ఇవ్వాలన్నారు.

పంట నమోదును తనిఖీ చేసిన జేసీ


పంట నమోదు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

కోడుమూరు రూరల్, నవంబరు 4, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో పంట నమోదును జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ తనిఖీ చేశారు. పొలాల్లో పంట వివరాలను రైతులనడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఆధారంగా సాగు చేస్తే నష్టాలను అధిగమించవచ్చని, ఒకే రకమైన పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేయవద్దని సూచించారు. ఆర్డీవో సందీప్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్ నాయక్ ఏవో రవిప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాని ఎంపీడీవో కృష్ణమోహన్ శర్మ సూచించారు. మంగళవారం ఎంపీపీ సునీత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై చురుకుగా పనులు చేపట్టాలన్నారు. అధికారులు, తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు.

గర్భిణులను నిర్లక్ష్యం చేయొద్దు


మాట్లాడుతున్న వైద్యాధికారి మిథున్ కుమార్‌రెడ్డి

సి. బెళగల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గర్భిణుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించవద్దని వైద్యాధికారి మిథున్‌కుమార్‌రెడ్డి సూచించరు. మంగళవారం పీహెచ్‌సీలో అశవర్కర్ల తో సమావేశం నిర్వహించారు. ఏఎన్‌మ్, అశావర్కర్లు, హెల్త్ సూపర్ వైజర్లు ప్రతి మంగళవారం గ్రామాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు.

ఐకమత్యంతో సమస్యల పరిష్కారం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలో పనిచేసే కాంట్రాక్టర్లంతా ఐకమత్యంతో సమస్యలను పరిష్కరించుకోవాలని గ్రేటర్ కర్నూలు కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్ సూచించారు. బుధవారం స్థానిక డీవీఆర్ సమావేశ భవనంలో సమావేశం నిర్వహించారు. 2015లో ఏర్పడిన అసోసియేషన్‌ను రద్దు చేశామని, ఇటీవల కొందరు కాంట్రాక్టర్లు మరో అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారని తెలిసిందన్నారు. కాంట్రాక్టర్లంతా ఒకే అసోసియేషన్‌లో ఉంటేనే న్యాయం చేకూరుతుందన్నారు. ఈ నెల 14న చట్టబద్ధంగా అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కాంట్రాక్టర్లు టి. వెంకటేశ్వరరెడ్డి, ఈ. శ్రీనివాసులు రెడ్డి, నరసింగరావు, షరీఫ్, ఎం.మనోహర్‌రెడ్డి, సుల్తాన్, బిజి.విక్రమ్‌యాదవ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రీడాకారుల ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పాఠశాలల క్రీడలు (అండర్-14, 17 బాలబాలికలు) క్రీడాకారుల ఎంపిక పోటీలు బుధవారం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి టి.కృష్ణ తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ కర్నూలు డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో ఎంపిక ఉంటుందన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు శ్రీకాకుళంలోని పలాస్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

రైతులకు అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ మధు

ఓర్వకల్లు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ మధు సూచించారు. మంగళవారం నన్నూరు సహకార సంఘంలో నాబార్డు, కేడీసీసీ బ్యాంకు సౌజన్యంతో సమావేశం నిర్వహించారు. నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, డైరెక్టర్ జంపాల త్రివిక్రమ్, రామాంజనమ్మ, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ రమాదేవి, సూపర్‌వైజర్ స్వప్న, సీఈవో సత్యనారాయణ ఉన్నారు.

ఓర్వకల్లు ఎంపీడీవోగా అనసూయ

ఓర్వకల్లు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా నాగ అనసూయను ప్రభుత్వం నియమించింది. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు నంద్యాల జిల్లా డ్వామా అకౌంట్స్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. గోస్పాడు డిప్యూటీ ఎంపీడీవోగా పని చేస్తున్న ఏ.నాగ అనసూయకు పదోన్నతిపై ఓర్వకల్లు ఎంపీడీవోగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



తాగునీటి వృథా.. అధికారులకు కనిపించదా?


బద్రీనాథ్‌నగర్‌లో లీకేజీ అవుతున్న తాగునీరు

కల్లూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని టీవీ టవర్ వద్ద 20వ వార్డు బద్రీనాథ్‌నగర్‌లో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. ప్రధాన రహదారి పక్కనే నీరు ఉంటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజుల క్రితం పైప్‌లైన్ పగిలినా వాటర్ వర్క్స్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే లీకేజీతో నీరు కలుషితవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, లీకేజీని అరికట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నైపుణ్యమస్తు



పాఠశాల నైపుణ్య పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జులకల్ గ్రామం ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో మంగళవారం నైపుణ్య పోటీలను నిర్వహించారు. 9వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ విద్యార్థులు పాల్గొన్నారు. వీరు 7వ తేదీన జిల్లా స్థాయిలో ప్రదర్శన ఇస్తారని, అక్కడ గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయికి వెళ్తారనీ ప్రిన్సిపాల్ దిల్షాద్ తెలిపారు. ఒకేషనల్ ఉపాధ్యాయులు, హర్షద్, మంజుల పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

- కోడుమూరు ఎస్సీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ డా. సిరి


విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

కోడుమూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని కలెక్టర్ డా.ఎ.సిరి సూచించారు. మంగళవారం ఆమె పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను, వంటగదిలో భోజన తయారీని పరిశీలించారు. వారంలో ఎన్నిసార్లు చికెన్, గుడ్డు ఇస్తున్నారని హాస్టల్ వార్డెన్ శిరీషను అడిగి తెలుసుకొన్నారు. వంట సరుకుల వివరాలు రికార్డులో పొందుపరచాలని సూచంచారు. హాస్టల్ గది పైకప్పు పెచ్చులూడుతోందని వార్డెన్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ మరమ్మతులకు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. హాస్టల్లో పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ తిభోజనం మెనూ ప్రకారం ఇస్తున్నారా, రుచిగా ఉంటుందా? యూనిఫాం ఇచ్చారా, పాఠాలు అర్థం అవుతున్నాయా లేదా ? అని విద్యార్థినులను అడిగి తెలుసుకొన్నారు. ఇంచార్జ్ ఎంపీడీవో క్రిష్ణారెడ్డి, రీ సర్వే డీటీ కృష్ణమూర్తి ఉన్నారు.

రహదారి పనులు త్వరగా ప్రారంభిస్తాం


రహదారిని పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్

ఓర్వకల్లు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండు నుంచి మర్రిచెట్టు కూడలి వరకు సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు ఆర్అండ్‌బీ, ఏపీఆర్‌డీసీ చీఫ్ ఇంజనీర్ ఎల్.శ్రీనివాసరెడ్డి అన్నారు. రహదారి దుస్థితిని ఎమ్మెల్యే గౌరు చరిత అధికారుల దృష్టికి తేవడంతో వారు మంగళవారం పరిశీలించారు. ఎట్టకేలకు రహదారి నిర్మాణ పనులు ప్రారంభమవుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించిన ట్రైనీ కలెక్టర్లు


విద్యుత్ కేంద్రం వద్ద ట్రైనీ కలెక్టర్లు, తహసీల్దార్

ఓర్వకల్లు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమితం తండాలో గ్రీన్‌కో సంస్థ సోలార్ జలవిద్యుత్ కేంద్రాన్ని మంగళవారం ట్రైనీ కలెక్టర్లు పరిశీలించారు. విద్యుత్ ఉత్పత్తిని ప్రాజెక్టర్ల ద్వారా అధికారులు ట్రైనీ కలెక్టర్లకు వివరించారు. అనంతరం హుశేనాపురం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రైతులు వేసిన పత్తి పంటను, పొదుపులక్ష్మి సంఘాన్ని పరిశీలించారు. తహసీల్దార్ విద్యాసాగర్, ఇన్‌చార్జి ఎంపీడీవో రమణయ్య, సోలార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హాకీ శతాబ్ది ఉత్సవాలు అభినందనీయం

- ర్యాలీని ప్రారంభించిన నగరపాలక కమిషనర్




హాకీ ర్యాలీ ప్రారంభిస్తున్న కమిషనర్, క్రీడా ప్రతినిధులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలో హాకీ క్రీడ ప్రారంభమై వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం అవుట్‌డోర్ స్టేడియం వద్ద ర్యాలీని ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ హాకీ జాతీయ క్రీడ అని ఒలంపిక్స్‌లో మూడుసార్లు బంగారు పతకాలు సాధించిన ఘనత హాకీకే ఉందన్నారు. జిల్లాలో హాకీని అభివృద్ధి చేయాలన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూహాకీ క్రీడకు అభివృద్ధికి సహకరిస్తానన్నారు. హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ మాట్లాడుతూ 7న అవుట్‌డోర్ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఎస్సీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుడిపల్లి సురేందర్, వెయిట్ లిఫ్టింగ్ సెక్రటరీ పాపా, పవర్ లిఫ్టింగ్ సెక్రటరీ వేణుగోపాల్, రైఫిల్ అసోసియేషన్ సభ్యులు బాషా, కరీముల్లా పాల్గొన్నారు.

తెగులు నివారణకు చర్యలు తీసుకోండి

కోడుమూరు రూరల్, నవంబరు 4, (ఆంధ్రజ్యోతి): కందిలో ఎండు తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని ఏవో రవిప్రకాష్‌గౌడ్ సూచించారు. మంగళవారం ప్యాలకుర్తి గ్రామంలోని కంది పొలంలో 'పొలంపిలుస్తోంది' నిర్వహించారు. పురుగును గమనించి ఎకరాకు 100 గ్రాముల ఇమామెక్టిన్‌బెంజోయేట్, ల్యాంబా సైలోత్రిన్ 250మి.లీల చొప్పున, పూత రాలకుండా 13-0-45 అనే మైక్రోన్యూట్రి యెంట్ ఎకరాకు కేజీ చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. ఎకరాకు 500 గ్రాముల కాపర్‌ఆక్సీక్లోరైడ్ వాడితే ఎండు తెగులును నివారించవచ్చని తెలిపారు.

కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర శివారు దూపాడు కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 'స్టాటిస్టికల్ మెథడ్స్ ఫర్ డేటా సైన్స్' పుస్తకాన్ని చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కరస్పాండెంట్ విజయలక్ష్మి ఆవిష్కరించారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు స్టాటిస్టికల్ మెథడ్స్ సుళువుగా అర్థమయ్యే రీతిలో రాశారని ప్రశంసించారు. డాక్టర్ నాగేంద్రరెడ్డి, డాక్టర్ ఎం.సురేష్‌బాబు ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

క్రీడా వార్తలు

క్రీడల నిర్వహణ అభినందనీయం


క్రీడాకారులతో రామాంజనేయులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యాసంస్థల్లో క్రీడల నిర్వహణ అభినందనీయమని జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మంగళవారం నగరంలోని జోహరాపురం రోడ్డు నారాయణ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో నారాయణ ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించారు. విద్యార్థుల శారీరక దృఢత్వం కోసం వారిని క్రీడల వైపు మళ్లించాలని వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. విద్యాసంస్థల క్లస్టర్ ఇన్‌చార్జి ఎం.శ్రీనివాసులు రెడ్డి, కిడ్స్ ఇన్‌చార్జులు జైబా ప్రియాంక, ఏవో తిమ్మారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు సురేష్, మహేష్‌తో పాటు కోర్టు షబ్బీర్‌హుశేన్, ఫంక్షన్ కోఆర్డినేటర్లు తన్వీర్, ఆధిత్రి పాల్గొన్నారు.

కరాటేలో స్వర్ణ పతకం


పతకం అందుకుంటున్న ప్రతాప్

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సిటోరియా కరాటే చాంపియన్‌షిప్‌లో వెటరన్ కేటగిరి విభాగంలో డా. కోలా ప్రతాప్ స్వర్ణ పతకం సాధించాడు. ఈ నెల 1, 2 తేదీల్లో మైసూర్‌లోని చాముండి విహార్ ఇండోర్ స్టేడియంలో పోటీ నిర్వహించారు. ప్రతాప్‌ను జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు బి.రామాంజనేయులు, క్రీడా సంఘం ప్రతినిధులు అభినందించారు

కేశవరెడ్డి పాఠశాలలో జోనల్ క్రీడలు

- ప్రారంభించిన చైర్మన్


విద్యార్థులతో కేశవరెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటరమణ కాలనీలకేశవరెడ్డి పాఠశాల మైదానంలో మంగళవారం జోనల్ క్రీడలను వ్యవస్థాపకుడు ఎన్.కేశవరెడ్డి ప్రారంభించారు. క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎన్.కేశవరెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు చదువులో మాత్రమే కాకుండా క్రీడల్లో కూడా రాణించేలా వారి ప్రతిభను వెలికితీసి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో తమ పాఠశాలలు ఎల్లప్పుడూ ముందుంటాయన్నారు.

కార్తీక దీపోత్సవానికి ఏర్పాట్లు

- నగర పాలక కమిషనర్ విశ్వనాథ్


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద బుధవారం నిర్వహించనున్న కార్తీక దీపోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం ఘాట్ వద్ద ఏర్పాట్లును పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశమున్నందున గజ ఈతగాళ్లను సిద్ధగా ఉంచుకోవాలని, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణలో సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం దేవనగర్ సీసీ రహదారి పనులను పరిశీలించి రహదారికి ఇరువైపులా మొక్కలు నాటి ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ప్రజారోగ్య అధికారి డా.నాగశివప్రసాద్, ఎంఈ మనోహర్‌రెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, డీఈఈ గిరిరాజు, గంగాధర్ ఏఈ భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

దోమలను నివారించండి


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కోడుమూరు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వర్షం ప్రభావంతో దోమలు పెరగకుండా నివారించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్, జిల్లా మలేరియా అధికారి నూకరాజు సూచించారు. మండలంలోని లద్దగిరి పీహెచ్‌సీలో మంగళవారం ఆశాడేలో పాల్గొన్నారు. గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, జ్వరపీడితులకు వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్స అందించాలన్నారు. వైద్యాధికారులు భాస్కర్, జయంతి సూపర్‌వైజర్స్ శాంత, శ్రీనివాస యాదవ్, శారద, నిర్మల, రాణి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు ఇస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని అభయగిరిలో కుష్టు, హెచ్ఐవీ బాధితులకు లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ఫోర్ట్ సభ్యులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మంగళవారం అభయగిరి కేంద్రంలో క్లబ్ అధ్యక్షుడు రహమతుల్లా, ఇతర ప్రతినిధులు రమణగౌడ్, బోస్, పాండురంగారెడ్డి, దామెర ప్రభాకర్, రామరాజు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలి


కొత్తబస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు రూరల్ నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు అదనపు బస్సు సర్వీసులు నడపాలని సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తబస్టాండ్ వద్ద సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో మహేష్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఉచిత బస్సు ప్రయాణంతో వలన మహిళలు అధికంగా ప్రయాణిస్తుండటంతో బస్సులు సరిపోవడం లేదన్నారు. కర్నూలు నుంచి, గుంతకల్, గుత్తి, అనంతపురం, నంద్యాల, ఆళ్లగడ్డ, కడప, శ్రీశైలం, ఆదోని ప్రాంతాలకు రద్దీ ఎక్కువగా ఉండి, ప్రయాణికులు నిలుచుని ప్రయాణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రద్దు చేసిన బస్సులను పునరుద్ధరించాలని కోరారు. అనంతరం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. అన్వర్‌బాషా, నల్లన్న, గిడ్డమ్మ, కుమార్, రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

వైద్యం అందించండి

ఓర్వకల్లు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్ రఘు సూచించారు. మంగళవారం నన్నూరు పీహెచ్‌సీలో సంచార చికిత్సను తనిఖీ చేశారు. జన్మనిచ్చిన ఏ తల్లి చనిపోకూడదని, శిశువు మరణించకూడదన్న లక్ష్యంతో సేవలు అందించాలని తెలిపారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవమయ్యేలా ప్రోత్సహించాలని తెలిపారు. పోషకాహారం, రక్తహీనతపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. పిల్లలు తక్కువ బరువుతో పుట్టడంతో శ్వాస ఆడకపోవడం, శరీర ఉష్ణోగ్రతలు సక్రమంగా ఉండకపోవడం, పోషకాహార లోపంతో బాధపడే వారిని కర్నూలు సర్వజన ఆసుపత్రిలో పౌష్టికాహార పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. వైద్యులు డా.నాగరాజు, సామాజిక ఆరోగ్య అధికారి రాధా మోహన్, క్షేత్ర స్థాయి పర్యవేక్షకుడు ప్రభాకర్ రెడ్డి, మోహన్, ఆనమ్మ, విజయలక్ష్మి, ఎస్తేర్ రాణి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ప్రాజెక్టనిస్టు ఖలీల్ తదిరులు పాల్గొన్నారు.

ప్రథమ స్థానంలో నిలపాలి

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రికెట్‌లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని మునగాలపాడు, కల్లూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలల హెచ్ఎంలు గిరి, హుశేన్ సూచించారు. మంగళవారం అవుట్‌డోర్ స్టేడియంలో బాలుర క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. ఇటీవల మహిళా క్రికెట్ టీమ్ ప్రపంచ కప్ సాధించడంతో వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శేఖర్, దాసు, పరమేష్, రవి పాల్గొన్నారు.

నగరంలో నేడు కార్తీక దీపోత్సవం


కేసీ కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్చి

కర్నూలు కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేసీ కెనాల్, తుంగభద్ర నదీ తీరాల్లో బుధవారం కార్తీక దీపోత్సావాలు నిర్వహించనున్నారు. మహిళలకు ఎంతో ప్రీతికరమైన వేడుక కావడంతో కార్తీక దీపాలను సిద్ధం చేసుకొని పూజలు, వ్రతాలు, నోములకు సిద్ధమయ్యారు. నగరంలో ఆలయాలతో పాటూ ధార్మిక కేంద్రాలలో ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తోంది. కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద లక్ష దీపోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రజల దాహం తీర్చేకపోతే ఎలా?



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న వైకుంఠం జ్యోతి

ఆలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నీళ్లు అందుబాటులో ఉన్నా ప్రజల దాహార్తిని ఎందుకు తీర్చలేకపోతున్నారని టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అధికారులను ప్రశ్నించారు. మంగళవారం ఆలూరు ఆర్ అండ్‌బి అతిథి గృహంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులతో తాగునీటి సమస్యపై మాట్లాడారు. ఈ సందర్భంగా వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ పక్కనే బాపురం రిజర్వాయర్‌లో వర్షాలకు నీరు ఉన్నప్పటికీ ఆలూరు పట్టణంలో 15 రోజులకొకసారి నీరు ఎందుకు వస్తున్నాయని, దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇలాగైతే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. రెండు శాఖలు సమన్వయంతో తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ప్రజా సమస్యలను గుర్తించని, పట్టించుకోని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జున, ఏఈలు, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

వర్షపు నీరు తొలగింపు



మోటార్ల ద్వారా వర్షపు నీరు తొలగిస్తున్న దృశ్యం

వెల్దుర్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):ఇటీవల కురిసిన వర్షాలకు రైల్వే భూగర్భ వంతెన కింద రోడ్డుపై నీరు నిలవడంతో వాహనదారుల, పాదాచారుల ప్రయాణం నరకప్రాయంగా మారింది. ప్రజలు సమస్యను టీడీపీ మండల అధ్యక్షుడు బలరాంగౌడు, సింగిల్‌విండో చైర్మన్ రమాకాంత్‌రెడ్డి కి తెలియజేశారు. మంగళవారం రోడ్డు పై నిలిచిన వర్షపు నీటిని మోటార్ల ద్వారా తొలగించారు. వెంటనే స్పందించి నాయకులకు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

మద్దతు ధరతో పత్తి కొనుగోలు

వెల్దుర్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేస్తోందని ఏడీఏ మోహన్ విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం వెల్దుర్తి రైతుసేవా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి అక్బర్‌బాషా ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మద్దతు ధర పొందాలంటే రైతులు రైతుసేవా కేంద్రాల్లోపత్తి పంటను నమోదు చేసుకోవాలన్నారు. సీసీఐ మొదటి విడత 6, రెండో విడతలో 4 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తారని అన్నారు.

తుగ్గలి ఏవోకు ఎంపీడీవోగా పదోన్నతి

తుగ్గలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుగ్గలి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న మహబూబ్ బాషాకు ఎంపీడీవోగా పదోన్నతి రావడంతో ఎంపీడీవో విశ్వమోహన్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీహరి, సిబ్బంది మంగళవారం తుగ్గలి ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఏపీవో హేమసుందర్, పంచాయతీ కార్యదర్శులు రాజు నాయక్, గోపాల్, కార్తికరంగనాథ్, శివ, రామకృష్ణ, రామాంజనేయులు, జూనియర్ అసిస్టెంట్ రామబ్రహ్మం ఉన్నారు.

అన్నదాతకు సాగు కష్టాలు

- ఎల్లెల్సీ ద్వారా రెండో పంటకు నీరందించాలని కలెక్టర్‌కు అధికార పార్టీ నేతల వినతి

ఆదోని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లెల్సీ పరిధిలో రబీ రెండో పంట సాగుకు సాగునీరు అందించాలనే డిమాండ్‌తో అధికార పార్టీ నేతలు రంగంలోకి దిగారు. రైతుల తరపున మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంకా మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో నేతల బృందం జిల్లా కలెక్టర్ సిరిని మంగళవారం కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం మీనాక్షినాయుడు మీడియాతో మాట్లాడుతూ తాము అధికార పార్టీలో ఉన్నప్పటికీ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఎల్‌ఎల్‌సీ పరిధిలోని వేలాది ఎకరాల రైతులు రబీ పంట సాగు కోసం ఎదురు చూస్తున్నారని, వారికి సాగునీరు అందకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కీలక సమస్యను కర్నూలు జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి వెంటనే తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు కచ్చితంగా రబీ పంటకు నీరు అందించేందుకు కృషి చేస్తామని, త్వరలోనే సానుకూల నిర్ణయం వెలువడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

విపక్షాలపై విమర్శలు

విపక్షాల వారు ఎక్కడున్నారో వారికే తెలియాలి, రైతు సమస్యలపై ప్రతిపక్షం స్పందించకపోవడంపై మీనాక్షినాయుడు ఘాటుగా విమర్శించారు. సాధారణంగా ఇలాంటి కీలక అంశాలపై ప్రతిపక్ష పార్టీ నేతలు ముందుండి పోరాడాలి, కానీ వారెక్కడున్నారో వారికే తెలియాలని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నా రైతుల పక్షాన తామే కలెక్టర్‌ను కలవాల్సి వచ్చిందని పరోక్షంగా విమర్శించారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర్‌రెడ్డి, ఎల్‌ఎల్‌సీ చైర్మన్ రామస్వామి, డివిజన్ పరిధిలోని ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, పక్కన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

రైతులను ఆదుకోవడంతో ప్రభుత్వం విఫలం



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే, సీపీఐ,సీపీఎం నాయకులు

దేవనకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయి రైతులు ఇబ్బందులు పడుతున్న కూటమి ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమైందని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ప్రభుత్వంపై విరుచుకుపడ్డాడు. వర్షాలతో పంటలు నష్టపోయిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించడం లేదని, ఆయన నియోకవర్గంలోని రైతులకే న్యాయం చేయలేనోడు, రాష్ట్రంలోని రైతులకు న్యాయం ఏలా చేస్తాడంటూ నిలదీశారు. అతివృష్టి కారణంగా మండలాని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ, సీపీఎం, వైసీపీ అధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ప్రధాన గేటుకు తాళం వేసి ధర్నా చేశారు. సర్వసభ్య సమావేశానికి అధికారులు వెళ్లకుండా వామపక్ష నాయకులు, వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. అధిక వర్షాలతో నష్టపొయిన రైతులను ఆదుకోవాలని తహసీల్దార్ సుదర్శనం, ఏవో ఉషారాణికి వినతిప్రతం ఇచ్చారు. జెడ్పీటీసీ రామకృష్ణ, సీపీఎం, సీపీఐ నాయకులు సూరి, కండప్ప, తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మ అవ్వ గుడికి విరాళం

ఆదోని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం గణేకల్లు గ్రామంలో వెలిసిన బంగారమ్మ అవ్వ గుడి పునర్నిర్మాణానికి గుడిసె కృష్ణమ్మ రూ.25 వేలను మంగళవారం విరాళంగా అందజేశారు. గ్రామపెద్దల కోరిక మేరకు ఆమె ఈ సహాయం అందించారు. మాజీ సర్పంచ్ మాధవ, మల్లయ్య, బంగారు బాబు, ఎల్లప్ప, సుంకన్న, సవారి తిమ్మప్ప, లక్ష్మన్న పాల్గొన్నారు.

రబీ పంటలకు సాగునీరు అందేలా చూడాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తుంగభద్ర డ్యాం పరిధిలోని దిగువ కాలువ కింద సాగు చేస్తున్న రబీ పంటలక సాగునీరు అందేలా చూడాలని ఎల్లెల్సీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ టిప్పు సుల్తాన్, తెలుగు రైతు సంఘం జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబా కోరారు. మంగళవారం వారు కలెక్టర్ డాక్టర్ సిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. అధిక వర్షాల వల్ల ఇప్పటికే ఖరీఫ్ పంటలు తీవ్ర నష్టం చేకూరాయన్నారు. కనీసం మార్చి చివరి వరకు సాగునీరు ఇస్తే రైతులు కోలుకుంటారన్నారు.

అండగా ఉంటాం..



ఆర్థికసాయం అందజేస్తున్న జయమనోజ్‌రెడ్డి

ఆదోని రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు మండలం కొటేకల్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను వైసీపీ మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు జయమనోజ్‌రెడ్డి పరామర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగళవారం గ్రామానికి మృతుల కుటుంబాలను ఓదార్చడంతోపాటు ఒక్కొక్క కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈయన వెంట గురునాథ్‌రెడ్డి, నాయక్ నారాయణ, కడబూరయ్య, చంద్రశేఖర్‌గౌడ్, సుధాకర్ ఉన్నారు.

'పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలి'

హొళగుంద, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నేరణికి పంచాయితీ కార్యదర్శి డబ్బులు తీసుకొని అక్రమాలకు పాల్పడుతున్న మహమ్మద్ షఫీని విధుల నుండి సస్పెండ్ చేయాలని గ్రామస్థులు ఖాసీం, బోయ మల్లికార్జున, గాదిలింగ, మల్లయ్య, చాకలి సదాశివ మంగళవారం డిమాండ్ చేశారు. కొన్ని నెలలుగా గ్రామానికి రాకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడమే కాకుండా అక్రమంగా కొళాయి కనెక్షన్‌లు, ఇంటి గుత్తల ఇస్తూ అక్రమంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో విజయ లలిత కోరగా కార్యదర్శి పై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పప్పు శనగ విత్తన సాగు చేయకండి

మద్దికెర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాతావరణంలో రెండు రోజుల పాటు నల్లరేగడి పొలాల్లో పప్పుశనగ విత్తన సాగు చేయకండని వ్యవసాయ శాఖ అధికారి రవి తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌బీకే కేంద్రంలో ఆమె మాట్లాడుతూ మంగళవారం మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వల్ల ఈ నెల 6వ తేదీ వరకు వర్షాలు పడే అవకాశం ఉందని, అందువల్ల రైతులు పప్పుశనగ విత్తనం సాగు చేస్తే నష్టపోతారని అన్నారు. రైతులు విత్తన సాగు చేయవద్దని తెలిపారు. మండలంలో ఖరీఫ్, రబీలో సాగు చేసిన పంటలకు పంట నమోదు చేసుకోవాలని వివరించారు.

పెరిగిన హుండీ ఆదాయం



హుండీ లెక్కిస్తున్న భక్తులు

మద్దికెర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ఎంతో ప్రసిద్ది చెందిన శ్రీరంగనాథ స్వామి హుండీ ఆదాయం పెరిగింది. మంగళవారం శ్రీరంగనాథ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదోని డివిజన్ తనిఖీ అధికారి ఎస్.వెంకటేష్, ఈవో ఆర్.వీరయ్య, పాలక మండలి చైర్మన్ పారా రవికుమార్ ఆధ్వర్యంలో 7 నెలల శాశ్వత హుండీ లెక్కింపు చేశారు. గత ఏడాది శాశ్వత హుండీ ద్వారా రూ.10,62,160లు రాగా, ఈ సంవత్సరం గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.11,13,349లు వచ్చింది. ప్రధాన అర్చకులు రంగస్వామి, కమిటి సభ్యులు నెట్టికంటయ్య, వెంకటగిరి, శ్రీనివాసులు, గోపాల్, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

18న ఆదోనిలో రాష్ట్ర పత్తి రైతుల సమ్మేళనం

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): : ఈనెల 18,19 తేదీలలో ఆదోనిలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, జిల్లా కార్యదర్శి నాగేంద్రయ్య తెలిపారు. స్థానిక ఏఐవైఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర సమ్మేళనం కరపత్రాలను విడుదల చేశారు.

రాష్ట్ర స్థాయిలో రాణించాలి

మద్దికెర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెరవలి గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించాలని రంగనాథ స్వామి దేవాలయ చైర్మన్ పారా రవికుమార్, ప్రధానోపాధ్యాయులు ఉమ అన్నారు. మంగళవారం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కల్పన, అనూషలు, 8వ తరగతి చదువుతున్న నౌషద్, 7వ తరగతి చదువుతన్న వైష్ణవి అండర్-17 విభాగంలో హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు అభినందించారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో కృష్ణా జిల్లా పడమట గ్రామంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. చదువుతో పాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యాకమిటి చైర్మన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు చంద్రమౌలి, వెంకటేశ్వర్లు, కే.విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పేదలకు సేవలు అందించడమే లక్ష్యం

ఆదోని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పేదలకు సేవలు అందించడమే లక్ష్యమనిభగత్‌సింగ్ సుందరయ్య ఫౌండేషన్ చైర్మన్ ఎం.తాహేర్‌వలి తెలిపారు. ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న రెండు అంబులెన్స్‌లను తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం అంబులెన్స్‌ల నిర్వహణ బాధ్యతలు తీసుకుని, వాటి ద్వారా పేదలకు సేవలు అందించేందుకు అనుమతి ఇవ్వాలని సూపరింటెండెంట్‌కు వినతి పత్రం సమర్పించారు. ఫౌండేషన్ సభ్యులు రామాంజనేయులు, పవన్, అంజి, మోహన్, లక&న్న, భీరప్ప, దస్తగిరి పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీ విద్యార్థితో ఎమ్మెల్యే మాటామంతీ

సమస్యలను ప్రస్తావించాలని సూచన

పత్తికొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న విద్యార్థుల మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి పత్తికొండ నియోజకవర్గం తరపున ఎంపికైన వెల్దుర్తి ఎస్సీ గురుకుల విద్యార్థిని గాయత్రీతో మంగళవారం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాటమంతీ చేశారు. పత్తికొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని గాయత్రీని సన్మానించారు. అసెంబ్లీలో తన సీటులో నిన్ను కూర్చోబెడతారని, అక్కడ పరిస్థితులు ఎలా ఉంటాయన్నది విద్యార్థికి వివరించారు. ప్రధాన సమస్యలైనా వ్యవసాయం, సాగునీరు, 68 చెరువులతో పాటు టెక్నికల్ విద్యాలయాల ఆవశ్యకతను ప్రస్తావించాలని విద్యార్థికి సూచించారు. గ్రామస్థాయి నుంచి మండలస్థాయి, నియోజకవర్గ స్థాయిలో పెట్టిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి మాక్ అసెంబ్లీ గాయత్రీ ఎంపిక కావడం పట్ల ఆమెను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసూన, డాక్టర్ ఆర్ అరుణ, స్వర్ణకుమారిలు ఉన్నారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబు

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

పత్తికొండ: వైద్యఖర్చులకు ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలాంటిదని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళారం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించి 38 లబ్ధిదారులకు 29లక్షల30 వేల రూపాయల చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందించారు. టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తినలోక్‌నాథ్, కడవల సుధాకర్, తిరుపాలునాయుడు, ధనుంజయుడు తపాల్గొన్నారు.

వెల్దుర్తి:మండలంలో మదార్‌పురం గ్రామానికి చెందిన అమ్మిశెట్టి రామచంద్రుడు గ్రామనాయకుడు మనోహర్ ఆధ్వర్యంలో మంగళవారం పత్తికొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ చేతుల మీదుగా 1.లక్ష రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందుకున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని అన్నారు.





దేవాలయ అభివృద్ధికి సహకరిస్తా

మద్దికెర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దికెర గ్రామం మద్దమ్మ కుంట సమీపాన వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎన్‌ఆర్ఐ అర్థగేరి సీతారామిరెడ్డి తెలిపారు.

సహకారం అందించాలి

ఆలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెనకబడిన ఆలూరు ప్రాంత అభివృద్ధికి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ డా.సిరిని కలిసి కోరినట్లు జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తెర్నేకల్ వెంకప్ప మంగళవారం తెలిపారు. వందికోన రిజర్వాయర్ నుంచి ఆలూరు నియోజకవర్గానికి తాగు, సాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలు, అభివృద్ధి పనుల గురించి చర్చించామన్నారు. సమస్యల పరిష్కారానికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఐటీ కో ఆర్డినేటర్ రంజిత్‌కుమార్, ఆస్పరి మండల జనసేన పార్టీ కన్వీనర్ అరవింద్‌కుమార్, జగదీష్ పాల్గొన్నారు.

రీ సర్వే పరిశీలన



పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ త్రివిక్రమ్‌రావు

ఆస్పరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగరడోన గ్రామంలో రీ సర్వే పనులను రీ సర్వే డిప్యూటీ డైరెక్టర్ త్రివిక్రమ్‌రావు మంగళవారం పరిశీలించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడానికి ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమం చేపట్టిందన్నారు. రీ సర్వేలో ఎలాంటి సమస్యలు తలెత్తినా సంబంధిత భూ యజమానులకు సమాచారం ఇచ్చి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రైతులు సర్వేలో అధికారులకు సహకరించాలని సూచించారు. అసిస్టెంట్ డైరెక్టర్ మునికంఠన్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ భీమేష్, వీఆర్వో రామంజిని అధికారులు పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ టీమ్‌కు అభినందనలు



ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

తుగ్గలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా ఎదురు చూసిన మహిళా క్రికెట్ వరల్డ్ కప్‌ను సాధించిన మహిళా క్రికెట్ జట్టుకు ప్రతి ఒక్కరూ మద్దతుగా ఉండాలని, వారిని ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించేలా ప్రతి విద్యార్థీ ముందుకు రావాలని ప్రధానోపాధ్యాయులు అగస్టీన్, జిల్లా పీఈటీల కార్యదర్శి చందూ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన తుగ్గలి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మహిళా వరల్డ్ కప్ గెలిచిన ఇండియా మహిళా క్రికెటర్లకు మద్దతుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు శ్రీను, గంగ, ఆది, సుదాకర్, రాము పాల్గొన్నారు.

అవకతవకలు జరగనివ్వొద్దు

ఆదోని రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భూ రీసర్వేలో అవకతవకలు జరగకుండా చూసుకోవాలని సర్వే డిప్యూటీ డైరెక్టర్ త్రివిక్రమ్ తెలిపారు. ఆదోని మండలం విరుపాపురంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రైతులతో సమావేశమయ్యారు. జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు అధికారి మునికన్నన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, గ్రామ విఆర్‌ఓ తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

ఆదరణ పథకం వర్తింపచేయాలి

రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి

ఆదోని టౌన్ , నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న ఆదరణ పథకం రాష్ట్రంలోని రజకులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను కోరినట్లు రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్ పర్సన్ సావిత్రి తెలిపారు. గొల్లపూడి బీసీ సంక్షేమ భవన్‌లో బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో మంగళవారం అన్ని కుల కార్పొరేషన్లకు చెందిన చైర్మన్‌లతో జరిగిన ఆదరణ పథకం 3 అమలు కార్యక్రమంలో తాను పాల్గొని మాట్లాడినట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ధోబి పోస్టులు రజకులకే ఇవ్వాలని, ప్రభుత్వ కాంప్లెక్స్‌లలో 5 శాతం షాపులను లాండ్రి ఏర్పాటుకు రజకులకు కేటాయించాలని కోరానన్నారు. ధోబి ఘాట్లను అభివృద్ధి పరిచి, రజక కమిటీ భవనాల నిర్మాణాలను చేపట్టాలని, ఎండోమెంట్ దేవస్థానాలలోని పాలక మండలాల్లో రజకులకు స్థానం కల్పించాలని మంత్రి దృష్టికి తీసుకొని రావడంతో ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్ర రజకులను ఆదుకుంటుందన్న నమ్మకం ఉందన్నారు.

'ప్రజలు నిలదీస్తున్నారు'

దేవనకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'గత నాలుగున్నర ఏళ్లుగా ఎంపీటీసీ సభ్యులుగా కొనసాగుతున్నాము. ఎన్నో హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచి ఇక్కడి కొస్తే తాము చేసే పనులు కూడా జరగడం లేదు. తమ పరిధిలోని ప్రజలకు కనీసం నీళ్లు ఇవ్వలేని పరిస్థితి. పనులు చేయకపోవడంతో గ్రామాలలోని ప్రజలు నిలదీస్తున్నార'ని కుంకనూరు ఎంపీటీసీ సభ్యురాలు ఉషారాణి మండల సమావేశంలో ఆలూరు ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయన మావేశ భవనంలో మంగళవారం ఎంపీపీ లక్ష్మిదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ్యులకు కనీస గౌరవం ఇవ్వడం లేదని ఎంపీటీసీ సభ్యులు తపాల శ్రీనివాసులు అధికారులను నీలదిశారు. రైతులను ఆదుకోవాలని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జడ్పీటీసీ రామకృష్ణ, ఎంపీడీవో జ్యోతి, తహసీల్దార్ సుదర్శనం, ఏవో ఉషారాణి, ఏఈ మురళీ మోహన్ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఆలూరు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హులేబీడు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున కర్ణాటక వాహనం ఢీకొని తుంబలబీడు గ్రామానికి చెందిన కొలిమి దేవేంద్రప్ప(36) అక్కడికక్కడే మృతిచెందాడు. తుంబలబీడు గ్రామానికి చెందిన కొలిమి దేవేంద్రప్ప తన తల్లి గోవిందమ్మ కూరగాయల వ్యాపారం నిమిత్తం తుంబలబీడు గ్రామం నుంచి హులేబీడుకు వచ్చి ఆదోనికి వెళ్లే బస్సుకి తల్లిని ఎక్కించాడు. దేవేంద్ర రోడ్డు పక్కన తుంబలబీడుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండగా, ఆదోని నుంచి బళ్లారి వైపు వస్తున్న కర్ణాటకు చెందిన కేఏ638722 నంబర్ గల టిప్పర్ వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన దేవేంద్రప్ప అక్కడికక్కడే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తుంగభద్ర డ్యాం నీటి విడుదలపై
సీఎం దృష్టికి తీసుకెళ్తాం


మాట్లాడుతున్న తిక్కారెడ్డి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

ఎమ్మిగనూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎల్లెల్సీ కింద రబీ సీజన్‌లో సాగుచేసుకుంటున్న రైతులకు వచ్చే ఏడాది మార్చి ఆఖరు వరకు సాగునీరు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఇరిగేషన్ శాఖమంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌దగ్గర ఆయన విలేకరులతో మాట్లాడారు. తుంగభద్ర డ్యాం నీటి విడుదలపై స్థానిక ఎమ్మెల్యే, ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం నాయకులంతా కలిసి కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు. తుంగభద్ర డ్యాంలో సంవృద్ధిగా నీరు ఉన్నాయన్నారు. డ్యాం అధికారులు గేట్ల మరమ్మతు కోసం డిసెంబర్ వరకే నీరు ఇస్తామంటున్నారన్నారు. దీంతో జిల్లా రైతులు ఎంతో నష్టపోతారని పేర్కొన్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌లో అతి వర్షాలవల్ల రైతులు ఎంతో నష్టపోయారన్నారు. రబీలో ఎల్లెల్సీకి మార్చి వరకు సాగునీరు ఇస్తే కొంతమేరైన రైతులకు ఉపశమనం కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి మార్చి ఆఖరువరకు నీరు ఇచ్చే బాధ్యత తీసుకుంటానన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమాకాంతరెడ్డి, సాయిబాబా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండో పంటకు సాగు నీరు ఇప్పించేందుకు కృషి
మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు



ఎల్లెల్సీ కింద రబీలో రైతులకు సాగునీరు ఇచ్చేందుకు ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు నాయకులంత కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు పేర్కొన్నారు. ఎల్లెల్సీ నీటి విడుదలపై రైతుల్లో అనుమానాలు ఉన్నాయని అదే విషయంపై నాలుగు నియోజకవర్గాల నాయకులు చర్చించామన్నారు. ప్రతిపక్షనాయకులు ఎవరూ మాట్లాడడం లేదన్నారు. ప్రజలకు, రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే ఎమ్మిగనూరుకు వచ్చిన కలెక్టర్‌ను కలిసి విన్నవించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎల్లెల్సీ చైర్మన్ టిప్పు సుల్తాన్, నాయకులు రమాకాంత రెడ్డి, రామకృష్ణారెడ్డి, సాయిబాబ, మార్కెట్ చైర్మన్ కురువ మల్లయ్య పాల్గొన్నారు.

పంటలకు సాగునీరందిస్తాం : ఎమ్మెల్యే బీవీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీరు తెచ్చేది.. నీళ్లు ఇచ్చేది కూటమి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద మాట్లాడుతూ ప్రతిపక్షాలు రైతులకు ప్రభుత్వం ఎక్కడ నీళ్లు ఇస్తుందని అంటూ ఏవేవో మాట్లాడుతున్నారన్నారు. ఎల్లెల్సీ నీటి విడుదలపై మూడు నెలల ముందుగానే ఆలూరు, ఆదోని ఎమ్మిగనూరు, మంత్రాలయం నాయకులంతా సమావేశమై తుంగభద్రడ్యాం నీటి విషయమై చర్చించి కార్యాచరణ చేశామన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. డ్యాం అధికారులు గేట్ల మరమ్మతుల కోసం డిసెంబర్ వరకే నీరు విడుదల చేస్తామని తెలిసిందన్నారు. అయితే మన ప్రాంతానికి రావాల్సిన నీటి వాటా ఎలా రాబట్టాలో సహచర నాయకులతో చర్చించామన్నారు. రబీ సీజన్‌లో ఎల్లెల్సీ కింద మార్చి వరకు సాగునీరు అందించేందుకు డ్యాం అధికారులపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. అలాగే సీఎం చంద్రబాబు నాయుడు, నీటిపారుదల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు. 7న జరగాల్సిన డ్యాం బోర్డు మీటింగ్ వాయిదా 21వ తేదీకి వాయిదా పడిందన్నారు. డ్యాం బోర్డు మీటింగ్ జరిగితే నీటి విడుదలపై స్పష్టత వస్తుందన్నారు. ఎలాగైనా రైతులకు సాగునీరు అందిస్తామన్నారు.

భూమాత రక్షణ కమిటీతో రైతులకు లాభాలు


చిలకలడోణలో పత్తిపంటను పరిశీలిస్తున్న అధికారులు

మంత్రాలయం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూమాత రక్షణ కమిటీల వల్ల రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి జీరా గణేష్ అన్నారు. మంగళవారం చిలకలడోణ, కల్లుదేవకుంట గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు, వ్యవసాయ సహాయకులు ఆధ్వర్యంలో భూమాత రక్షణ కమిటీ ఏర్పాటు చేసి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లడుతూ భూమాత రక్షణ కమిటీ వల్ల భూమిని సారవంతం చేయడం, ఎరువులు అక్రమ నిల్వలు, రవాణా, ఎరువులు అతిగా వాడకం తగ్గించటం, మట్టి నమూన సేకరణ వంటి వాటి పనుల ద్వారా రైతులకు ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఏఈవో తిరుమలరెడ్డి, గణేష్, లక్ష్మీరెడ్డి, నిత్యజీవన్ పాల్గొన్నారు.

జల హారతికి ఏర్పాట్లు పూర్తి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ, అధికారులు

మంత్రాలయం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో బుధవారం జల హారతి, లక్ష దీపోత్సవం నిర్వహణపై భక్తులు ఇబ్బందులు పడకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ తెలిపారు. మంగళవారం తుంగభద్ర నది తీరంలో వీఐపీ స్నానఘట్టం వద్ద, పుట్టీలు, బారికేడ్లు, లైటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. 50 మంది పోలీసులు, 20 మంది గజ ఈతగాళ్లు, ట్రాఫిక్ నియంత్రణపై ముందు జాగ్రత చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పత్తి రైతు సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తిపంట సాగుచేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఈనెల 18, 19వ తేదీల్లో ఆదోనిలో చేపట్టిన రాష్ట్రస్థాయి పత్తి రైతు సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్నలు కోరారు. మంగళవారం సీపీఐ కార్యాలయం ముందు సమ్మేళన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రంలో రైతులు అధిక శాతం పత్తిపంటను సాగుచేయడం జరిగిందన్నారు. సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో రైతులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేసీ జబ్బార్, మద్దిలేటినాయుడు, మాలిక్, శాంతప్ప, బీజీ విరుపాక్షి, వెంకటేష్, గిడ్డయ్య పాల్గొన్నారు.

ప్రతి రోజు ఎన్‌సీడీ4.0 సర్వే నిర్వహించాలి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలో పనిచేసే సిబ్బంది ప్రతి రోజు ఎన్‌సీడీ 4.0 సర్వే నిర్వహించాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ మహేశ్వర ప్రసాద్ తెలిపారు. మంగళవారం దైవందిన్నె పీహెచ్‌సీలో గ్రామస్థాయి వైద్య సిబ్బందితో కలిసి ఆశా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక ఆరోగ్య అధికారులు పూర్తిస్థాయిలో బాధ్యత తీసుకోవాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో ప్రతి రోజు ఎన్‌సీడీ 4.0 సర్వేను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ మల్లికార్జున, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సమస్యలను తెలియజేయండి : కలెక్టర్ సిరి


భోజనం రుచి గురించి ప్రజలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకరావాలని కలెక్టర్ సిరి ప్రజలకు సూచించారు. పట్టణంలో కలెక్టర్ మంగళవారం అన్న క్యాంటిన్, ప్రభుత్వ ఆసుపత్రి, సీసీఐ కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. అన్న క్యాంటీన్‌లో భోజనాలు చేయడానికి వచ్చిన వారిని భోజనం రుచిగా ఉందా, క్యాంటీన్‌లో మీతో ఎలా ప్రవర్తిస్తున్నారు, శుభ్రత పాటిస్తున్నారా అని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతతో మాట్లాడుతూ చికిత్స ఎలా చేస్తున్నారు, చికిత్సకు ఏమైనా డబ్బులు అడిగారా అని అడిగి తెలుసుకున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ప్రతి రైతుకు చెందిన పత్తిని కొనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఎకరాకు 8 క్వింటాళ్ల వరకు సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తున్నామని అన్నారు. రైతులకు ఇబ్బందిగా ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషాఫణి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, సూపరిండెంటెంట్ డాక్టర్ సుధా అయ్యంగార్ పాల్గొన్నారు.

మార్చిలోపు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి : పీడీ


మాట్లాడుతున్న జిల్లా డీఆర్‌డీఏ పీడీ వైపీ రమణారెడ్డి

గోనెగండ్ల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం ద్వార గృహాలను పొందిన లబ్ధిదారులు 2026 మార్చి లోపు గృహ నిర్మాణపనులను పూర్తి చేసుకోవాలని జిల్లా డీఆర్‌డీఏ పీడీ వై.పీ. రమణారెడ్డి కోరారు. మంగళవారం గోనెగండ్లలోని కేజీబీవీ కాలనీలో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ గృహాలను జిల్లా డీఆర్‌డీఏ పీడీ వై.పీ. రమణారెడ్డి, ఎంపీడీవో మణిమంజరి, హౌసింగ్ డీఈ ప్రసాద్ పరిశీలించారు. ఏఈ షేక్షావలి ని అడిగి సమాచారం తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో సమావేశం భవనం నందు మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా డీఆర్‌డీఏ పీడీ వై.పీ. రమణారెడ్డి మాట్లాడుతూ మండలానికి పీఎంఏవై 1.0 కింద 1632 గృహాలు మంజూరయ్యాయని అందులో 597 గృహాల నిర్మాణ పనులు పూర్తి కాగా 917 గృహాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వచ్చే మార్చి లోపు నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలన్నారు. లేని పక్షంలో ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం కింద మంజూరైన గృహాలను ప్రభుత్వం రద్దు చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ షేక్షావలి, ఏపీఎం హేమలత, ఏపీఎం మహమ్మద్ బాషా పాల్గొన్నారు.

ఆలయాల ప్రతిష్ఠ


పీఠాధిపతులకు తులాభారం నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాత్రికి గ్రామంలో పద్దమ్మవ్వ, దేవమ్మవ్వ ఆలయాల ప్రతిష్ఠ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. హల్వి, హచ్చోళ్ళి, రౌడకుంది, చికిలపర్వి మఠాల పీఠాధిపతుల చేతుల మీదుగా ఆలయాలను ప్రారంభించారు. అనంతరం పీఠాధిపతులకు తులభారం కార్యక్రమం నిర్వహించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : దేశాయి


నందవరంలో అరుణమ్మకు నివాళి అర్పిస్తున్న దేశాయి మాదవరావు

నందవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలకు నిరంతరం అండగా ఉంటానని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ దేశాయి మాదవరావు అన్నారు. మంగళవారం నందవరంలోని పాత దళిత కాలనీలో టీడీపీ కార్యకర్త ఆరేకంటి ఉసేని తల్లి ఆరేకంటి అరుణమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న దేశాయి ఇంటికి వెళ్లి మృతదేహం వద్ద నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. నాయకులు శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ తిమ్మరాజు, మైనార్టీ నాయకులు షరీఫ్, ఈరన్న, బతకన్న, సురేష్, జయన్న, ముక్కన్న, పృథ్వీరాజు, విజయ్, సామేల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మానవతా దృక్పథం పెంచుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథాన్ని పెంచుకోవాలని అగ్రహారం గ్రామంలోని ఒలివా పాఠశాల కరస్పాండెంట్ రాజు పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మిగనూరు మండలంలోని గువ్వలదొడ్డి గ్రామంలో మూడేళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న వీరేష్ కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులను అందజేశారు.

నూనె గింజల సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించాలి


రైతులకు వేరుశనగ విత్తనాలను అందజేస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నూనె గింజల పంటల సాగులో రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. మంగళవారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ఆయా మండలాల్లోని రైతులకు వేరుశనగ విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే తేనెటీగల పెంపకంపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నాటుకోళ్ల పెంపక శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు.ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ నూనెగింజలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేరుశనగ పంటలో రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించడం వలన అధిక దిగుబడిని సాధించవచ్చని తెలిపారు. రైతులు గడ్డిమందును వాడే సమయంలో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం 30మంది రైతులకు తేనెటీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాటుకోళ్ల పెంపకంలో శిక్షణ తీసుకున్న రైతులకు సర్టిఫికెట్లను అందజేసి సలహాలు, సూచనలు తెలిపారు. కార్యక్రమంలో మద్దికెర ఏవో రవి, శ్రీలక్ష్మీనరసింహస్వామి, రమేష్, డా. ఎం. వి. నిరంజన్‌రెడ్డి, నిర్మల, సైంటిస్టు సుప్రియ, గురువిష్ణు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కోసిగి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పశువులకు సంక్రమించే గర్భకోశ వ్యాధులపై పశు రైతులు అప్రమత్తంగా ఉండి పశువైద్యాధికారులకు సమాచారం ఇవ్వాలని డీఎల్‌డీఏ కర్నూలు డిప్యూటీ డైరెక్టర్ డా.రాజశేఖర్, ఆదోని డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డా.వెంకటరమణ, అసిస్టెంట్ డైరెక్టర్ డా. వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కోల్‌మాన్‌పేట గ్రామంలో పశువుల రైతులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని క్యాంప్ నిర్వహించారు. దాదాపు 40 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. అనంతరం పశువులకు సంబంధించిన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డా.సంతోష్ కుమార్, ప్యారా సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఎస్ఐకి సన్మానం


ఎస్ఐను సన్మానిస్తున్న నాయకులు

కోసిగి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోసిగి ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డి.రమేష్ రెడ్డిని మంగళవారం పలువురు టీడీపీ, బీజేపీ, సీపీఐ, వైసీపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. ముందుగా కోసిగిలోని టీడీపీ నాయకులు పెండ్యాల భరద్వాజశెట్టి, పంపాపతి, వీరారెడ్డి, నాడిగేని మాదేవ, కృష్ణారెడ్డి, నరసింహులు, బీజేపీ మండల అధ్యక్షుడు జర్లగేరి ఈరన్న, తమ్మారెడ్డి, కురువ మారెన్న, రమేష్, నాడిగేని రాజు, పెండేకల్లు నరసన్న, గోపాల్, సీపీఐ నాయకులు గోపాల్, రాజు, ఓంకార్ స్వామి, తాయన్న, వైసీపీ నాయకులు వైసీపీ మండల ఇన్‌చార్జి మురళీరెడ్డితో పాటు నూతన ఎస్ఐ రమేష్‌రెడ్డిని కలిసి పూలమాలలు, శాలువలతో సన్మానించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు.

కూలిన మట్టిమిద్దె



కోసిగి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని సిద్దప్ప పాలెంలో నివాసముంటున్న నిరుపేద వృద్ధురాలు మందుల నరసమ్మ మట్టి మిద్దె ఇల్లు గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళవారం కూలిపోయింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని, నూతన గృహం కల్పించి ఆశ్రయం కల్పించాలని విజ్ఞప్తి చేసింది.

వాల్మీకుల సమస్యలపై సంకల్ప దీక్ష


పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

మంత్రాలయం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే వాల్మీకుల సమస్యలు పరిష్కారం కోసం దృఢ సంకల్ప దీక్షను చేపడుతున్నట్లు మంత్రాలయం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జీ, రాష్ట్ర ఐక్యవాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు బీ. లక్ష్మన్న అన్నారు. మంగళవారం మంత్రాలయంలో 10న కర్నూలులో ఏపీవీబీఎస్ (ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతినాయుడు ఏర్పాటు చేసిన దృఢ సంకల్ప దీక్ష వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏపీవీబీఎస్ రాష్ట్ర కార్యదర్శి రామానాయుడు, జిల్లా అధ్యక్షులు అర్జున్, తాలూకా అధ్యక్షులు, ఎల్ఎల్‌సీ కాల్వ చైర్మన్ సూగూరు నరసింహులు, భీమన్న, మహేష్, వీరారెడ్డి పాల్గొన్నారు.